

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755





సెల్వరాజ్‌కు డిక్లరేషన్ ఫారం అందజేస్తున్న పీవో శ్రీనివాసరాజు - మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు హాజరైన ఎమ్మెల్సీలు, కౌన్సిలర్లు

కుప్పం మున్సిపల్ కోటపై పసుపు జెండా రెపరెపలు!

- చైర్మన్ ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం
- ఊహించని రీతిలో సెల్వరాజ్‌కు పదవి
- వైసీపీనుంచి నలుగురు కౌన్సిలర్లు ఇటు రావడంతో సాధ్యమైన గెలుపు



టీడీపీ శ్రేణుల విజయోత్సవ ఊరేగింపు

కుప్పం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. ప్రతిష్ఠాత్మకమైన కుప్పం పురపాలక పీఠాన్ని తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. ఉద్రిక్తత రేపుతుందనుకున్న ఎన్నిక, చివరికి పోలీసు బలగాల పహరా మధ్య ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.కుప్పం పురపాలక చైర్మన్ ఎన్నిక సోమవారం ఉదయం 11 గంటలకు జరిగింది. వైసీపీ శిబిరంలో ఉన్న ఆ పార్టీ కౌన్సిలర్లు 8 మంది ఉదయం 10 గంటలకే ఎన్నిక స్థలమైన కుప్పం మండల సచివాలయంలోని సమావేశపు హాలుకు పోలీస్ ప్రొటెక్షన్‌తో చేరుకున్నారు. వారి వెంట ఆ పార్టీ ఎమ్మెల్సీ భరత్ ఉన్నారు. మరోవైపు అధికార టీడీపీ శిబిరంలో ఉన్న ఆ పార్టీ కౌన్సిలర్లు 10 మందితోపాటు అదనంగా నలుగురు వైసీపీ కౌన్సిలర్లు కూడా ఉదయం 9 గంటల ప్రాంతంలో మొదట కుప్పంలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడినుంచి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో వాహనంలో బయలుదేరి ఉదయం 10.15 గంటలకు కుప్పం మండల సచివాలయానికి వచ్చారు. వైసీపీకి చెందిన 14వ వార్డు కౌన్సిలర్, 1వ వైస్ చైర్మన్ బి.మునస్వామి, 15వ వార్డు కౌన్సిలర్ తిలవతి గైర్హాజరయ్యారు. ప్రిసైడింగ్ అధికారి అయిన ఆర్డీవో శ్రీనివాసరాజు సరిగ్గా ఉదయం 10 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభించారు. ఇరు పార్టీలకు చెందిన ఇద్దరు ఎమ్మెల్సీలు, 22మంది కౌన్సిలర్ల సంతకాలు సిబ్బంది ద్వారా తీసుకున్నాక చేతులు ఎత్తే పద్ధతిలో ఎన్నిక నిర్వహించారు. టీడీపీ చైర్మన్ అభ్యర్థిగా 5వ వార్డు కౌన్సిలర్ వి.సెల్వరాజ్ పేరును 19వ వార్డు కౌన్సిలర్ బి.కె.దామోదర్ (జిమ్ దాము) ప్రతిపాదించగా 20వ వార్డు కౌన్సిలర్ ఎస్.సోమశేఖర్ బలపరిచారు. వైసీపీ చైర్మన్ అభ్యర్థిగా 9వ వార్డు కౌన్సిలర్, 2వ వైస్ చైర్మన్ అయిన ఎస్.డి.హఫీజ్ పేరును 2వ వార్డు అభ్యర్థి ఆర్.మునిరాజు ప్రతిపాదించగా 7వ వార్డు అభ్యర్థి ఎం.నాగరాజు బలపరిచారు. చేతులు ఎత్తే పద్ధతి ద్వారా ఎన్నిక నిర్వహించారు. ఎక్స్ అఫిషియో సభ్యుల హోదాలో అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, కె.ఆర్.జె.భరత్‌లతోపాటు 22 మంది కౌన్సిలర్లు కలిసి మొత్తం 24 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీడీపీ అభ్యర్థి వి.సెల్వరాజ్‌కు 15 ఓట్లు, వైసీపీ అభ్యర్థి ఎస్.డి.హఫీజ్‌కు 9 ఓట్లు వచ్చాయి. దీంతో 6 ఓట్ల మెజారిటీతో టీడీపీ అభ్యర్థి వి.సెల్వరాజ్ కుప్పం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా గెలిచినట్లు ప్రిసైడింగ్ ఆఫీసర్ శ్రీనివాసరాజు ప్రకటించారు. ఆ వెంటనే పూర్తి చేసిన డిక్లరేషన్ ఫారాన్ని ఆయనకు అందించారు.

చక్రం తిప్పిన ఎమ్మెల్సీ కంచర్ల

తెలుగుదేశం పార్టీకి కుప్పం మున్సిపల్ కౌన్సిల్‌లో పార్టీ తరఫున గెలిచిన ఆరుగురు కౌన్సిలర్లతోపాటు వైసీపీనుంచి చేరిన నలుగురు కలిసి మొత్తం 10 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వైసీపీకి 14 మంది కౌన్సిలర్లున్నారు. అయితే చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ రాగానే ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ రంగంలోకి దిగారు.ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబుతోపాటు పార్టీలోని ముఖ్యులైన ద్వితీయ శ్రేణి నేతలు, ముఖ్య కార్యకర్తలతో కలిసి వ్యూహం రచించారు.టీడీపీ నిర్వహించిన శిబిరానికి ఎన్నికకు మూడునాలుగు రోజుల ముందే వైసీపీ కౌన్సిలర్లు అరవింద్, చంద్రమ్మ (గణపతి తల్లి), దేవకి (రంగయ్య భార్య), సయ్యద్ అలీ చేరుకున్నారు. మరోవైపు వైసీపీకి చెందిన 14వ వార్డు కౌన్సిలర్ మునస్వామి, ఆయన తల్లి అయిన 15వ వార్డు కౌన్సిలర్ తిలవతి సైలెంట్ అయ్యారు.మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్సీ భరత్ ఎంతగా మంత్రాంగం చేసినా ఆ పార్టీ శిబిరంలో కేవలం 8మంది కౌన్సిలర్లు మాత్రమే మిగిలారు. గత నెల 27న జరిగిన రామకుప్పం ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలో సరైన వ్యూహం కొరవడడంవల్ల చివరి క్షణం వరకు ఉత్కంఠ కొనసాగి ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ ఎన్నిక విషయంలో తీసుకున్న ముందుజాగ్రత్తలు పక్కాగా ఫలించాయి. చివరకు టీడీపీలో ఇప్పటికే ఉన్న 10 మంది కౌన్సిలర్లతోపాటు వైసీపీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు టీడీపీ అభ్యర్థికి జై కొట్టారు.

దేనికైనా అదృష్టం ఉండాలి

మున్సిపల్ చైర్మన్ పదవికోసం టీడీపీనుంచి మొదట జిమ్ దాము (19), ఎస్.సోమశేఖర్ (20) మధ్య పోటీ నడిచింది. 5వ వార్డు కౌన్సిలర్ వి.సెల్వరాజ్ పేరు కూడా వినిపించినా ఎవరూ పట్టించుకోలేదు.అయితే దాము, సోమశేఖర్ మధ్య పోటీ పెరిగిపోయి ఆదివారం రాత్రి దాకా వీరిద్దరిలో ఎవరో ఒకరిని ఆ పదవి వరిస్తుందన్న ప్రచారమే పార్టీలోనూ, బయటా జోరుగా సాగింది. అయితే సోమవారం శిబిరంనుంచి చైర్మన్ ఎన్నిక కోసం కుప్పం బయలుదేరుతున్నామనగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునుంచి పార్టీ ముఖ్యులకు గ్రూప్ కాల్ వచ్చింది. ఆయన చైర్మన్ పేరు ప్రకటిస్తారనగా శిబిరంలోని ముఖ్య నేతలు వద్దని చెప్పినట్లు సమాచారం. అలా చేస్తే పేరు బయటకు వెళ్లిపోయి ఏదైనా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నదని వారు బావించడమే దీనికి కారణం. చివరకు జిమ్ దాము, సోమశేఖర్ పేర్లు తెర వెనక్కు వెళ్లిపోయి, చైర్మన్ పదవి అనూహ్యంగా సెల్వరాజ్‌ను వరించింది.

విజయోత్సాహం

కుప్పం మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవడంతో టీడీపీలో జోష్ పెరిగింది. చైర్మన్‌గా గెలిచిన సెల్వరాజ్‌తో కలిసి పార్టీ శ్రేణులు పట్టణంలో ఊరేగింపు తీశాయి. పసుపు జెండాలు పట్టుకుని భారీఎత్తున నాయకులు, కార్యకర్తలు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, కుప్పం మున్సిపల్, కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, బాబు నాయుడు, విశ్వనాథ నాయుడు, ఆనందరెడ్డి, టీడీపీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జులు వీజీ.ప్రతాప్, సత్యేంద్రశేఖర్ తమతమ మండలాల పార్టీ శ్రేణులతో కుప్పం తరలివచ్చారు.కుప్పం మండల సచివాలయంనుంచి బయలుదేరిన ఊరేగింపు ఆర్టీసీ బస్టాండు కూడలి చేరుకుంది. అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఊరేగింపు పార్టీ కార్యాలయం చేరుకుంది.

డీసీసీబీ చైర్మన్‌గా మరోసారి అమాస

వైసీపీ హయాంలో వేధింపులు...

గాలి భాను విజయానికి కృషి కారణం

డీసీసీబీ కోరిన పల్లినేనికి సీడీసీఎంఎస్‌తో న్యాయం



అమాస రాజశేఖర రెడ్డి

చిత్తూరు /చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార రంగ చరిత్రలో సుదీర్ఘకాలం డీసీసీబీ చైర్మన్‌గా పనిచేసిన అమాస రాజశేఖర రెడ్డిని మరోసారి ఆ పదవి వరించింది. ప్రభుత్వం సోమవారం ప్రకటించిన నామినేటెడ్ పదవుల జాబితాలో ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధ్యక్ష పదవికి ఆయన పేరు చోటుచేసుకుంది.గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర వేధింపులు ఎదుర్కోవడం, గత ఎన్నికల్లో నగరి నుంచీ గాలి భానుప్రకాష్ విజయానికి కృషి చేయడం వంటివి ఆయనకు పదవి దక్కడానికి కారణాలయ్యాయి.

అమాస రాజశేఖర రెడ్డి 2006లో డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నిక కావడం జిల్లావ్యాప్తంగా ఆశ్చర్యానికి గురి చేసింది. ఆయన తండ్రి అమాస గోపాల రెడ్డి అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డికి సన్నిహితుడు కావడంతో పదవి దక్కింది. 2006 నుంచీ 2011 వరకూ ఐదేళ్ళ పాటు చైర్మన్‌గా కొనసాగిన అమాస తర్వాత అప్పటి సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మద్దతుతో రెండవ పర్యాయం కూడా చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 2016 వరకూ కొనసాగారు. పదవీకాలం పూర్తయ్యేనాటికి టీడీపీ ప్రభుత్వం వున్నప్పటికీ ఆయనను తొలగించకుండా 2019 వరకూ కొనసాగించింది.2017 నవంబరులో నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డితో పాటు అమాస కూడా టీడీపీలో చేరారు.2017-19 నడుమ డీసీసీబీ చైర్మన్ హోదాలో ఆయన కుప్పం పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు బ్యాంకు నిధులు విడుదల చేశారు.దీనిపై తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆయనపై కేసు కూడా నమోదు చేయించింది. తర్వాత రాజకీయంగా చురుగ్గా లేకపోయినా గతేడాది ఎన్నికల్లో నగరి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ విజయానికి తెర వెనుక పనిచేశారు. ఈ రెండు కారణాలతో టీడీపీ అధిష్ఠానం ఆయన పట్ల సానుకూల దృక్పథంతో వుంది. దానికి తోడు సహకార రంగంలోని రెండు కీలక పదవుల్లో డీసీసీబీని రెడ్డి సామాజికవర్గానికి ఇవ్వాలని నిర్ణయించింది. నగరి,పలమనేరు,పీలేరు ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాష్,అమరనాధరెడ్డి,నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అమాస పేరును సిఫారసు చేసినట్టు తెలిసింది. ఇవన్నీ అమాసకు కలిసి రావడంతో గతంలో 13 ఏళ్ళ పాటు కొనసాగిన డీసీసీబీ చైర్మన్ పదవిలో ఇపుడు మళ్ళీ నియమితులయ్యారు.

● సీడీసీఎంఎస్ చైర్మన్‌గా సుబ్రమణ్యం నాయుడు



డీసీసీబీ చైర్మన్ పదవి ఆశించిన చంద్రగిరి మండల టీడీపీ అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడికి ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ పదవి దక్కింది.సుదీర్ఘకాలంగా టీడీపీలో కొనసాగుతున్న ఈయన పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా వారి విజయానికి పని చేస్తున్నారు. గతంలో చంద్రగిరి మండలం ఐతేపల్లి సింగిల్‌విండో అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పనిచేశారు. ఆయన సతీమణి పనపాకం సర్పంచుగా పనిచేశారు. గత ఆరేళ్ళుగా ఆయన చంద్రగిరి మండల టీడీపీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. తన విజయానికి గట్టిగా కృషి చేశారన్న కారణంగా ఎమ్మెల్యే పులివర్తి నాని డీసీసీబీ పదవి ఇవ్వాలని కోరారు. అయితే సామాజిక సమీకరణల్లో భాగంగా డీసీసీబీని రెడ్డి సామాజికవర్గానికి కేటాయించామని చెప్పిన అధిష్ఠానం సీడీసీఎంఎస్ చైర్మన్ పదవి ఖరారు చేసింది. డీసీసీబీ, సీడీసీఎంఎస్ చైర్మన్ పదవులు రెండూ కూడా తిరుపతి జిల్లా పరిధిలోని వారికే దక్కడం విశేషం.

గజదాడుల నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

ఏనుగుల విధ్వంసంపై డిప్యూటీ సీఎం సమీక్ష

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడం, రైతులపై దాడులు చేస్తుండడంపై ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ సోమవారం సమీక్షించారు.అటవీశాఖ ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన గజదాడులను అదుపులోకి తెచ్చేందుకు మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.చిన్నగొట్టిగల్లులో మూడురోజుల క్రితం ఏనుగు ఒక కౌలు రైతును తొక్కి చంపివేయడం, పాకాల మండలం గానుగపెంటలో పంటలను ధ్వంసం చేయడం ప్రస్తావించిన ఆయన ఏనుగుల వల్ల ప్రజలకు, ప్రజల వల్ల ఏనుగులకు ఎలాంటి హాని కలుగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.ఎలిఫెంట్ కారిడార్‌లో భాగంగా ఏనుగుల మందలు, ఒంటరి ఏనుగులు ఎటు వెళ్తున్నాయో ట్రాక్ చేయడంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఎలిఫెంట్ ట్రాకర్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని స్పష్టంచేశారు.ఇందుకోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని పీసీసీఎఫ్‌ను ఆదేశించారు. డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు తిరుపతి డీఎఫ్‌వో వివేక్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు.భాకరాపేట, పనబాకం, తిరుపతి రేంజి, చిత్తూరు ఈస్ట్, చిత్తూరు వెస్ట్‌రేంజ్‌లలో టాస్క్‌ఫోర్సు పనిచేస్తుందని తిరుపతి జిల్లా సీసీఎఫ్ సెల్వం తెలిపారు.చిత్తూరు డీఎఫ్‌వో భరణితో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సంబంధించి పీలేరు, తిరుపతి డీఎఫ్‌వోలు, తిరుపతి సబ్ డీఎఫ్‌వోలతో పాటు భాకరాపేట, పనపాకం, చిత్తూరు ఈస్ట్, వెస్ట్ పరిధిలో ఎఫ్ఆర్వోల బృందాలతో పాటు 10మంది ఎలిఫెంట్ ట్రాకర్స్ ఈ ప్రత్యేక టాస్క్‌ఫోర్సులో ఉండేలాగ చర్యలు తీసుకున్నారన్నారు. ఒక్కొక్క రేంజిలో 10 మంది ఎలిఫెంట్ ట్రాకర్స్ ఉంటారని, వీరు ఆయా గ్రామాల పరిధిలో ఏనుగుల సంచారాన్ని గుర్తించి స్థానిక ప్రజలను అప్రమత్తం చేస్తారన్నారు. విద్యుత్, పంచాయతీరాజ్ విభాగాలతో సంయుక్తంగా ఈ టాస్క్‌ఫోర్స్ పనిచేస్తుందన్నారు. సౌర విద్యుత్ ద్వారా పనిచేసే నూతన టెక్నాలజీ జీఎస్ఎం సిమ్ ఏనుగుల కదలికలను గుర్తించి తిరుపతిలో ఏర్పాటు చేయబోయే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరవేస్తుందన్నారు. గ్రామస్థులు ఏనుగుల గుంపు కనపడితే టోల్‌ఫ్రీ నెంబరు 18004255909, తిరుపతి డీఎఫ్‌వో 9440810069, చిత్తూరు డీఎఫ్‌వో 9440810113, తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో 9440810070, పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో 9440810114కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఏసీబీకి చిక్కిన శ్రీకాళహస్తి సర్వేయర్



లంచం సొమ్ముతో సర్వేయర్ పురుషోత్తంరెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండల సర్వేయర్ పురుషోత్తంరెడ్డి ఏసీబీ అధికారులకు చిక్కాడు.ఏసీబీ ఏఎస్పీ విమలకుమారి తెలిపిన ప్రకారం.. తిరుపతికి చెందిన కె.చంద్రశేఖర్‌రెడ్డి ప్రభుత్వ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్‌శాఖలో ప్రొటోకాల్ అధికారిగా పదవీ విరమణ చేశారు. శ్రీకాళహస్తిలోని పానగల్ వద్ద ప్రైవేటు కళాశాల నిర్వహిస్తున్నారు. పట్టణ శివార్లలోని విశాలాక్షి కాలనీ ఎదురుగా పానగల్ రెవెన్యూ పరిధిలో సర్వే నెం.172లో 75సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. దీనిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు (ల్యాండ్ కన్వర్షన్ కోసం) సుమారు రూ.1.70లక్షలు ప్రభుత్వానికి చలానా కట్టారు. రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. దీనికి సర్వేయర్ పురుషోత్తంరెడ్డి లంచం డిమాండు చేయగా.. చంద్రశేఖర్‌రెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ క్రమంలో సోమవారం తహసీల్దారు కార్యాలయంలో చంద్రశేఖర్ రెడ్డి నుంచి సర్వేయర్ పురుషోత్తంరెడ్డి రూ.25 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 వరకు తహసీల్దారు కార్యాలయంలో విచారించారు. తహసీల్దారు లక్ష్మీనారాయణను ఏసీబీ అధికారులు కార్యాలయానికి పిలిపించారు. అలాగే ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి కూడా తహసీల్దారు కార్యాలయానికి వచ్చారు. విచారణ అనంతరం సర్వేయర్ పురుషోత్తంరెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఆయన్ను నెల్లూరు ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్టు ఏఎస్పీ విమలకుమారి తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదుల వెల్లువ



అర్జీదారుల సమస్యలను తెలుసుకొంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ , ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపల్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అర్జీదారులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. గత వారం కార్యక్రమానికి 428 మంది హాజరవగా ఈవారం 436 మంది హాజరయ్యారు.వీరిచ్చిన అర్జీల్లో కొన్నింటిపై కలెక్టర్ అప్పటికప్పుడే పరిష్కారానికి చర్యలు తీసుకొన్నారు.భూ ఆక్రమణలపై 71, ఆర్‌వోఆర్ దిద్దుబాట్లు చేయాలని 53, పట్టాదారు పాసుపుస్తకాల కోసం 41, దారిసమస్య పరిష్కారానికి 23, ఇళ్ల పట్టాలకోసం 19, అసైన్‌మెంట్ భూముల కోసం 14, మ్యూటేషన్ కోసం 10, ఇళ్ల మంజూరు కోసం 8మంది అర్జీలు ఇచ్చారు.ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, కలెక్టరు సుమిత్‌కుమార్,జాయింట్ కలెక్టర్ విద్యాధరి అర్జీలు స్వీకరించారు.అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్రపాడల్,ఆర్డీవో భవాని , జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర రెడ్డి, డ్వామా పీడీ రవికుమార్, డీపీవో సుధాకర రావు, డీఆర్డీఏ పీడీశ్రీదేవి, ఐసీడీఎస్ పీడీవెంకటేశ్వరి,ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, సర్వే ఏడీ జయరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నరేంద్రకుమార్, డీఎల్‌డీవో రవికుమార్, కలెక్టరేట్ ఏవో కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భానుడి ప్రతాపం



మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నాకు హాజరయ్యేందుకు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన మహిళలు ఎండకు తాళలేక చెట్లకు పడుతున్న నీటిని తాగుతున్న దృశ్యం

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా సోమవారం ఎండలు జడిపించాయి. శ్రీరంగరాజపురంలో అత్యధికంగా 39.7, కుప్పంలో అత్యల్పంగా 33 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.నగరిలో 39.5, యాదమరిలో 38.5, చిత్తూరు, గుడిపాల మండలాల్లో 37.8, గంగాధరనెల్లూరులో 37.5, వెదురుకుప్పం, పులిచెర్ల, పూతలపట్టు, సోమల మండలాల్లో 36.9, తవణంపల్లె, బంగారుపాళ్యం, గంగవరం, పెద్దపంజాణి మండలాల్లో 36.6, కార్వేటినగరం, సదుం మండలాల్లో 36.4, చౌడేపల్లె, ఐరాల, పెనుమూరు, నింద్ర, విజయపురం, పాలసముద్రం మండలాల్లో 36.2, రొంపిచెర్లలో 35.6, శాంతిపురం, గుడుపల్లె మండలాల్లో 35, పలమనేరులో 34.4, బైరెడ్డిపల్లెలో 34.1, పుంగనూరు, వి.కోట మండలాల్లో 33.5, రామకుప్పంలో 33.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వేలం ప్రకటన

1. యస్.ఆర్. లక్ష్మిరాజేష్ PBL No: 2/2010-2011 డోర్‌నెం:12-101 మిద్దెపైన బి.కె. వీధి పలమనేరు వారి వద్ద కుదువ ఉంచి వాయిదా పోయిన నగలు 15-05-2025వ తేదీ సాయంత్రం 4గంటలకు వారి అంగడి వద్ద వేలం వేయబడును. 2. యస్.కె. రాజేష్ PBL No: 10/92-93 డోర్‌నెం:12-220 New:12-101 బి.కె. వీధి పలమనేరు వారి వద్ద కుదువ ఉంచి వాయిదా పోయిన నగలు 15-05-2025వ తేదీ సాయంత్రం 5 గంటలకు వారి అంగడి వద్ద వేలం వేయబడును. ఇందులో ఎవరికైనా ఆక్షేపము ఉండినా తెలిపినా వేలం నుండి మినహాయింపబడును.

ఇట్లు గవర్నమెంటు నియమించిన వేలందారులు,
కె. శ్రీనివాసులు, నెం:17, బజారు వీధి, తిరుపతి

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

గూడూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గూడూరులో ఆరు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కరీమాబేగం సోమవారం తెలిపారు. ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తుండగా తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లాకు చెందిన సెల్వకుమార్ మోహన్ రూ.30 వేల విలువ చేసే ఆరు కిలోల గంజాయి తీసుకెళ్తుండడంతో పట్టుకున్నామన్నారు.

30న నిర్వహించాల్సిన డిగ్రీ పరీక్ష వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 30వ తేదీన నిర్వహించాల్సిన డిగ్రీ పరీక్ష వాయిదా పడింది. ఈ పరీక్షను మే 15వ తేదీ నిర్వహించనున్నారు. పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ కారణంగా పరీక్ష వాయిదా వేసినట్లు పరీక్షల అధికారి రాజమాణిక్యం తెలిపారు.

నైపుణ్యాభివృద్ధి విభాగంలో రాజన్న ఫౌండేషన్‌కు అవార్డు

రేణిగుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి విభాగంలో బెస్ట్ 3 స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఇనిషియేటివ్ ఆఫ్ ద ఇయర్ 2025 అవార్డును రాజన్న ఫౌండేషన్ అందుకుంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్ రంగంలో రాజన్న ఫౌండేషన్ అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా సోమవారం న్యూఢిల్లీలోని హయత్ సెంట్రల్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో రాజన్న ఫౌండేషన్ హెడ్ సతీష్ రాళ్ళపల్లి ఆల్ ఇండియా పబ్లిక్ సెక్టార్ స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్, ఎక్స్ జనరల్ రమేష్ సచిదేవ్ చేతులు మీదుగా అందుకున్నారు. అవార్డు రావడం పట్ల రాజన్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గల్లా రామచంద్ర నాయుడు, అమర రాజా సంస్థల చైర్మన్ గల్లా జయదేవ్ హర్షం వ్యక్తం చేశారు.



న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకుంటున్న దృశ్యం


సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 8 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.53 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,177

తలనీలాలు సమర్పించినవారు: 23,694











నగరానికి సప్తవర్ణాల గొడుగు

ప్రసవం ఒక వేదన.. జననం ఒక ఆనందం.. తల్లికైనా.. పుడమి తల్లికైనా! మబ్బులు ముసురుకున్నంత మాత్రాన సూర్యోదయం ఆగదు. పసుపుపచ్చని లేత రంగులు నారింజవర్ణంలోకి మారి.. రవి కిరణ స్పర్శతో ఎర్రబారి.. నీలిమబ్బుల గొడుగుపట్టి.. ఇదిగో ఇలా ఎగసి వచ్చే భానుడికి రాగరంజితమై స్వాగతం పలుకకా తప్పదు.

సోమవారం ఉదయం తిరుపతి నగరంలో కనిపించిన నింగి వర్ణ దృశ్యాలను ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ అందిస్తున్నారు.

అతివేగం.. నిద్రమత్తు

రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కారణాలు


సోమవారం నాటి ప్రమాదంలో ధ్వంసమైన కారు

నిదానమే ప్రధానం వేగంకన్నా ప్రాణం మిన్న

జాతీయ రహదారి ఎక్కగానే ఈ సూక్తులను మరచిపోతున్నారు వాహన చోదకులు. టైమే లేదన్నట్లు.. వెంటనే వెళ్లిపోవాలన్నట్లు వాహనాలను పరుగు పెట్టిస్తున్నారు. మరో వైపు విశ్రాంతి లేక.. వాహనాన్ని నడిపే క్రమంలో అలసటతో పాటు కునుకుపాటు తప్పడంలేదు. అంతా బాగున్నంత వరకు ఇవన్నీ ఓకే.. కాకుంటే ప్రాణాలే పోతున్నాయి. ఎందరో వికలాంగులుగా మారుతున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

గతేడాది మే 27న చంద్రగిరి మండలం ఎం.కొంగరపల్లి వద్ద అతి వేగంగా వస్తున్న కారు అదుపు తప్పింది. కల్వర్టును ఢీ కొంది. ఈ ప్రమాదంలో నరసరావుపేటకు చెందిన ఆరుగురు మృతి చెందారు. సోమవారం నాటి ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత పడ్డారు. ఇలా ఏడాది కాలంలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై 26 ప్రమాదాలు చోటుచేసుకున్నారు. వీటిలో 32 మంది దుర్మరణం చెందారు. 11 మంది తీవ్రంగా గాయపడగా.. మరెందరికో స్వల్పగాయాలయ్యాయి. ఈ ప్రమాదాలన్నింటిని పరిశీలించిన పోలీసులు.. అతి వేగం, నిద్రమత్తే ఈ అనర్థాలకు కారణాలుగా విశ్లేషిస్తున్నారు. పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారి రెండు వరుసల రోడ్డుగా ఉన్నప్పుడే తరచూ ప్రమాదాలు జరిగేవి. ఇప్పుడు ఆరు వరుసలు రోడ్డుగా అభివృద్ధి చేశారు. ఒక్కో వైపు మూడు వరసల రహదారి కావడం.. రోడ్డు బాగా వుండడంతో వాహనాలు వేగంగా వెళ్తుంటాయి. దీంతో రోడ్డు ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. సోమవారం నాటి ప్రమాదానికీ అతివేగమే కారణమని ప్రాథమిక సమాచారం. నెమ్మదిగా వెళుతున్న కంటైనర్‌ను వెనుకనుంచీ ఎంతో బలంగా ఢీకొడితే గానీ కిందకు కారు దూసుకుపోయే అవకాశం లేదని పోలీసులు అంటున్నారు.

విశ్రాంతిలేని ప్రయాణం

ఇక, తిరుమల, కాణిపాకం, శ్రీకాళహస్తి క్షేత్రాల సందర్శనకు దూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ఎక్కువ మంది సొంత.. అద్దె వాహనాల్లో బయలుదేరి తమ యాత్రను తక్కువ వ్యవధిలో ప్లాన్ చేసుకుంటారు. అలాంటప్పుడు సెల్ఫ్ డ్రైవింగ్ లేదా, డ్రైవర్లు కంటిన్యూగా ఎక్కువ దూరం వాహనాన్ని నడపడటంతో అలసట, నిద్రలేమి తలెత్తుతోంది. వేగంగా వచ్చే క్రమంలో కంటిమీద రెప్ప పడితే చాలు.. వాహనం అదుపు తప్పి ప్రమాదానికి కారణమవుతుంది. వేగంగా వెళ్లే సమయంలో జరిగే ప్రమాదాలతో ఎక్కువ ప్రాణనష్టం జరుగుతోంది. పరిమిత వేగం.. డ్రైవర్లకు విశ్రాంతి ఉండేలా యాత్ర ప్లాన్ చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

హైవే పెట్రోలింగ్‌ను పటిష్ఠం చేస్తాం

ప్రమాదాలకు అతివేగం, నిద్రమత్తు కారణాలుగా తెలుస్తోంది. వీటిని అరికట్టేందుకు హైవే పెట్రోలింగ్ వ్యవస్థను మరింత పటిష్ఠరుస్తాం. స్పీడ్ మానిటరింగ్ ద్వారా వాహనాల వేగాన్ని నియంత్రించేలా చర్యలు చేపడుతున్నాం. జాతీయ రహదారుల్లో రాత్రి, తెల్లవారు జామున వాహనాలను ఆపి తరచూ తనిఖీ చేస్తున్నాం. 'ప్లీజ్ రండి.. వాహనం ఆపండి. దయచేసి మంచినీళ్లతో ముఖం శుభ్రం చేసుకోండి. కాసేపు విశ్రాంతి తీసుకుని ప్రయాణించండి' అనే నినాదాలతో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేస్తాం. తద్వారా కొంతవరకు రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి సాధ్యమవుతుంది.

- హర్షవర్ధనరాజు, ఎస్పీ

ఈసారైనా అభివృద్ధి గురించి చర్చిస్తారా ?

- ప్రతిసారీ గొడవలతో ముగుస్తున్న జడ్పీ సమావేశం
- గత సమావేశానికి జిల్లా అధికారుల గైర్హాజరుపై షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఏకగ్రీవ తీర్మానం
- జడ్పీ సమావేశ నిర్వాహణపై కలెక్టర్ ప్రత్యేక ప్రణాళికలు


జడ్పీ కార్యాలయం

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పల్లె పాలనకు పెద్దన్న లాంటి జిల్లా పరిషత్తు వైసీపీ పాలనలో చిన్నబోయింది.జగన్ సర్కారు హయాంలో స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయక పోవడంతో అభివృద్ధి పనులకు గండిపడింది. కేంద్రం స్థానిక సంస్థలకు విడుదల చేసిన నిధులను సైతం నాటి సర్కారు ఇతర పథకాలకు మళ్లించడంతో గడ్డు పరిస్థితులేర్పడ్డాయి.కూటమి ప్రభుత్వం వచ్చాక జడ్పీకి పూర్వవైభవం వచ్చింది. 15వ ఫైనాన్స్ కమిటీ నిధులు, జనరల్ ఫండ్ ద్వారా జిల్లాలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులకు మోక్షం లభించింది. గత నాలుగేళ్ల కాలంలో జడ్పీటీసీ, ఎంపీపీలకు చెల్లించాల్సిన గౌరవ వేతనాన్ని కూడా కూటమి ప్రభుత్వం వచ్చాకే చెల్లించింది. తిరిగి గ్రామాలకు పండగ వాతావరణం వచ్చింది. ఇలాంటి పలు అభివృద్ధి పనులపై జడ్పీ సర్వసభ సమావేశంలో చర్చించి మండలాలను అభివృద్ధి చేసుకోవాల్సిన సభ్యులు సమావేశ సమయాన్ని గొడవలతో నీరుగారుస్తున్నారు. చివరికి ఎటువంటి చర్చ జరగకుండా గొడవలతో సమావేశాన్ని ముగిస్తున్నారు. అయితే నేడు జరిగే జడ్పీ సమావేశంలోనైనా తాము ప్రాతినిధ్యం వహిస్తున్న మండలాలను అభివృద్ధి చేసుకునేందుకు సభ్యులు చర్చిస్తారా అనేది చూడాలి.

● సరికొత్త ప్రణాళికలతో సమావేశం నిర్వహణ

ప్రతి సమావేశంలో సభ్యుల గొడవలతో అభివృద్ధి పనులపై చర్చ జరగడంలేదు. కనీసం ప్రభుత్వం ఆయా శాఖల్లో ఎంత మేరకు నిధులు ఖర్చు చేస్తోంది. కూటమి సర్కారు వచ్చాక ఏఏ పనులు జరుగుతున్నాయనే విషయాలను కూడా ఆయా శాఖల అధికారులు వెల్లడించకుండానే సమావేశం ముగుస్తోంది. దీంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ సరికొత్త ప్రణాళికలతో ఈసారి సమావేశాన్ని నిర్వహించాలని భావిస్తున్నారు.శాఖాధిపతులు వారి శాఖలో చేసిన పనులు, చేయాల్సినవి తదితర విషయాలను 7 ప్రశ్నలకు సమాధానం రూపంలో సమావేశంలో చెప్పాలని ఆయా శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రభుత్వం వచ్చాక ఏం జరిగింది, ఏం జరగబోతుంది అనే విషయాలని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నది ఆయన భావన. దీంతో సమావేశం మొదలు కాగానే ఆయా శాఖల అధికారులు వారి శాఖలో జరిగిన అభివృద్ధి పనుల గురించి చెప్పాల్సి ఉంటుంది. ఆపైన వాటిపై చర్చలు జరపనున్నట్లు తెలుస్తోంది.

● సమావేశానికి సభ్యులకు మాత్రమే ఎంట్రీ

ప్రతీ సమావేశానికి సభ్యులకు మాత్రమే ఎంట్రీ అని చెబుతుంటారు. అయితే సమావేశం మొదలు కాగానే సభ్యులు కాని వారే అధికంగా ఉంటారు. సభ్యులకు సంబంధించిన భర్తలు, వారి అనుచరులతో సమావేశ మందిరం నిండిపోతోంది. దీంతో ఎవరు సభ్యులు, ఎవరు కాదో తెలుసుకోవడం పోలీసులకు సైతం ఇబ్బందిగా మారుతోంది. అయితే ఈసారి ఈ విషయాన్ని అధికారులు సీరియస్‌గా తీసుకుంటున్నారు. జడ్పీటీసీ, ఎంపీపీ, అధికారులు కాని వారిని ఎట్టిపరిస్థితుల్లో సమావేశానికి రానివ్వకుండా చర్యలు తీసుకోవాలని చూస్తున్నారు.

వైసీపీ సభ్యులను ఎదుర్కోవడంలో ఎమ్మెల్యేలు విఫలం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పుంగనూరు, తంబళ్లపల్లె తప్పితే మిగిలినవారంతా కూటమి ఎమ్మెల్యేలే. అయితే గత జడ్పీ సమావేశానికి కేవలం చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు మాత్రమే హాజరయ్యారు.వైసీపీ పాలనను ఎండగడుతున్న శ్రీకాళహస్తి జడ్పీటీసీపైకి వైసీపీకి చెందిన జడ్పీటీసీలు, ఎంపీపీలు దూసుకెళ్లారు. అక్కడే ఉన్న చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు కలగజేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. జడ్పీటీసీలు, ఎంపీపీలందరూ వైసీపీకి చెందిన వారే కావడంతో వైసీపీని విమర్శించిన వారిపై గుంపుగా దూసుకుపోతూ మిగిలిన వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు హాజరైతే సమావేశంలో సంఖ్యాబలం పెరుగుతుందని టీడీపీ మద్దతు సభ్యులు వాపోతున్నారు. అయితే వచ్చే నెల ప్రధాన మంత్రి పర్యటన కారణంగా మంత్రి, ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యే అవకాశం ఉందని సమాచారం.

● ఈసారైనా జిల్లా అధికారులు వస్తారా?

ఇప్పటి వరకు జరిగిన జడ్పీ సర్వసభ సమావేశం, స్టాండింగ్ కమిటీ సమావేశాలకు అధిక శాతం జిల్లా అధికారులు గైర్హాజరు అవుతూ వస్తున్నారు. దీనిపై గత స్టాండింగ్ కమిటీ సమావేశంలో జడ్పీ చైర్మన్ సహా సభ్యులందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము పని లేకకుండా వచ్చామా? సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని అసహనం వ్యక్తం చేశారు. అలాగే గైర్హాజరైన వారందరికీ షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సభ్యులందరు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ నేపథ్యంలో నేడు జరిగే సమావేశానికైనా అధికారులంతా వస్తారా అనేది చూడాలి.

రూ.2.5 కోట్ల ఎర్రచందనం స్వాధీనం

ఏడుగురు స్మగ్లర్ల అరెస్టు


స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి-పంగూరు మెయిన్ రోడ్డులోని దొమ్మరపాళెం వద్ద టాస్క్‌ఫోర్సు పోలీసులు తనిఖీలు నిర్వహించి, 72 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. లారీ, కారును స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ వినోద్ కుమార్ బృందం ఆదివారం శ్రీకాళహస్తి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. కాటూరు ఫారెస్టు బీటు పరిధిలో పంగూరు మెయిన్ రోడ్డు దొమ్మరపాళెం వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున కారు, దాని వెనుక లారీ వస్తూ టాస్క్‌ఫోర్సు పోలీసులను గమనించి కొద్ది దూరంలో ఆపి, అందులోని వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు చుట్టుముట్టి ఏడుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. లారీని పరిశీలించగా 72 ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. వాహనాలతో పాటు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లలో నలుగురు తిరుపతి జిల్లా, ముగ్గురు తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించారు. ఎర్రచందనం విలువ రూ.2.5 కోట్లు ఉంటుందని టాస్క్‌ఫోర్సు అధికారులు అంచనా వేశారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్ సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రూ.52.61 లక్షల మోసం

స్వామి మది యలగన్‌పై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో పూజలు, మంత్రాలు, తిరుమలలో దుకాణాలు ఇప్పిస్తానంటూ రూ.52.61 లక్షలు మోసం చేసిన ఘటనలో స్వామి మది యలగన్‌పై పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. అలిపిరి ఎస్ఐ లోకేష్‌బాబు తెలిపిన ప్రకారం.. చెన్నైకి చెందిన స్వామి కొన్నేళ్ల కిందట కుటుంబం సహా తిరుపతికి, తర్వాత 2021లో తిరుమలకు మకాం మార్చాడు. కొండపైన ఇల్లు అద్దెకు తీసుకుని పూజలు, మంత్రాలు పేరుతో డబ్బు వసూలు చేశాడు. ఇంటి యజయానితో గొడవపడి తిరుపతి శివజ్యోతినగర్‌లోని హిల్టెన్ టవర్‌కు మకాం మార్చాడు. జాతకాలు చెప్పడం, మంత్రాలతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో తనకున్న పరిచయాలతో పనులు చేసి పెడతానంటూ డబ్బు వసూలు చేశాడు. తాను పూజారినంటూ తిరుపతికి చెందిన ఓ రిటైర్డ్ డాక్టర్‌కు ప్రాణభయం, అనారోగ్యం, ప్రమాదాల వంటి వాటి రక్షణకోసం హోమాలు, పూజలు చేస్తానని పలు విడతలుగా తన సహచరుడు రామ్ అకౌంట్‌కు రూ.52.61 లక్షలు జమ చేయించుకున్నాడు. దీనిపై సోమవారం అలిపిరి పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేయగా, స్వామిపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాత్రిళ్లు పొలాలకు ఒంటరిగా వెళ్లొద్దు

● ఏనుగుల ప్రభావిత గ్రామాల్లో రైతులకు సీసీఎఫ్‌వో సూచన.. పంటల పరిశీలన



ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): 'రాత్రి పూట పొలాలకు ఒంటరిగా వెళ్లొద్దు. అక్కడ కాపలా ఉండొద్దు. ఒకటే ఏనుగు ఉందని భావించి ఒకరిద్దరు తరిమేందుకు ప్రయత్నిస్తే, పొరుగున ఉండే గుంపు వచ్చి దాడి చేసే ప్రమాదం ఉంది. పొలాల వద్ద తెల్లటి దుస్తులతో తిరగొద్దు. గున్న (పిల్లలు)లు తల్లి ఏనుగుతో ఉన్నప్పుడు తరిమేందుకు ప్రయత్నించవద్దు' అంటూ రైతులకు ఫారెస్ట్ చీఫ్ కన్సర్వేటర్ (సీసీఎఫ్‌వో) చలపతిరావు సూచించారు. చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం సరిహద్దులో.. ఏనుగుల ప్రభావిత ప్రాంతాల్లోని పంట పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ పంచాయతీ ఏస్టీకాలనీకి వెళ్లి వారిని అప్రమత్తం చేశారు. ఏనుగు సంచార సమాచారాన్ని ఎప్పటికప్పుడు స్థానిక సోషల్ మీడియా ద్వారా అధికారులు తెలియజేస్తారన్నారు. వదంతులను నమ్మవద్దని రైతులను కోరారు. రైతులు సమాచారమివ్వగానే రేంజ్ స్థాయి అధికారులు త్వరగా చేరుకోవాలన్నారు. ఆయన వెంట సీఎఫ్‌వో సెల్వం, తిరుపతి డీఎఫ్‌వో వివేక్, భాకరాపేట రేంజ్ ఆఫీసర్ వెంకటరణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండు పంచాయతీల్లో ఏనుగుల సంచారం

ఎర్రావారిపాలెం మండలం చింతగుంట పంచాయతీ పరిధిలో ఇటీవల రెండు ఏనుగులను గమనించి రైతు కొండవెంకట ముని భయంతో కేకలు వేయడంతో అవి మరో దారి పట్టినట్లు తెలిసింది. నెరబైలు పంచాయతీ-కూరపర్తి వారిపల్లె పంచాయతీ సరిహద్దులోని మామిడి తోటల్లో ఇవి సంచరిస్తున్నాయని సమాచారం. చిన్నగొట్టిగల్లు మండలం చిట్టిచెర్ల, దేవరకొండ పంచాయతీల్లోనూ ఏనుగులు విడిపోయి పంటలపై దాడి చేస్తున్నాయి. మరో 15 రోజుల్లో కోతకు వస్తున్న వరి పంటకు కాపలా కాయకుంటే పందులు,దుప్పులు తిని నాశనం చేస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నాయి.. కాపలాగా వెళ్లే ఏనుగులు ప్రాణాలు తీస్తాయని భయపడుతున్నారు.

ఆర్నెళ్ల తర్వాత పోలీసులకు చిక్కిన దొంగ

● 301 గ్రాముల బంగారం, రూ.3 లక్షల నగదు, ద్విచక్ర వాహనం స్వాధీనం


మీడియా సమావేశంలో డీఎస్పీ తదితరులు

చంద్రగిరి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):కల్‌రోడ్డుపల్లె పంచాయతీ కొత్తఇండ్లులో గతేడాది జరిగిన చోరీలో నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రాత్రి డీఎస్పీ ప్రసాద్ విలేకర్ల సమావేశంలో ఈ ఘటన వివరాలను వెల్లడించారు. మండలంలోని కొత్తఇండ్లుకు చెందిన సిద్దులు నాయుడు ఇంట్లో గతేడాది నవంబరులో దొంగతనం జరిగింది. 305 గ్రాముల బంగారం, రూ.6 లక్షల నగదు అపహరించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపటారు. ఈఏడాది జనవరి 7న తెలంగాణ సూర్యాపేట జిల్లా పోలీసులు ఓ చోరీ కేసులో పల్నాడు జిల్లాకు చెందిన షేక్ బాబావల్లిని అరెస్ట్ చేశారు. అతడ్ని విచారించగా కొత్తఇండ్లులో దొమ్మలపాటి సిద్దులనాయుడు ఇంట్లో తనతో పాటు తిరుపతి ఎంఆర్‌పల్లె వద్ద శ్రీకృష్ణనగర్‌కు చెందిన పులి నరేష్ దొంగతనానికి పాల్పడినట్లు చెప్పాడు. అక్కడి పోలీసుల సమాచారంతో చంద్రగిరి పోలీసులు నరేష్ కోసం గాలింపు చేపట్టారు. శ్రీకృష్ణనగర్‌లో ఇంటి వద్ద కాపు కాసి నిందితుడు నరేష్‌ను సోమవారం పట్టుకున్నారు. అతడ్ని అరెస్ట్ చేసి 301 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల నగదు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. మీడియా సమావేశంలో సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ అనిత, సిబ్బంది పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకొన్న ఆభరణాలు,నగదు

పట్టణాల్లో ట్రాఫిక్ మార్గాలు దాటుకుని జాతీయ రహదారి ఎక్కగానే ఎక్సలేటర్‌పై ఒత్తిడి పెరిగిపోతోంది. ఎదురుగా వచ్చే వాహనాలు లేకపోవడంతో రయ్‌మంటూ దూసుకుపోతున్నారు. పైగా ఆరు వరుసల జాతీయ రహదారి కావడంతో వేగానికి కళ్లెం వేయడంలేదు. ఇలాంటి



కంటైనర్ కింద ఇరుక్కున్న కారును కొంత దూరం వరకు లాక్కెళ్ళిన దృశ్యం

సంఘటనా స్థలం వద్ద ఐదుగురి మృతదేహాలు



విషాద యాత్ర

హరి హరులను దర్శించుకుని వెళుతుండగా ఘోర రోడ్డు ప్రమాదం

- పాకాల సమీపంలో కంటైనర్ కిందకు దూసుకెళ్లిన కారు
- ఐదుగురి దుర్మరణం, ఇద్దరికి తీవ్రగాయాలు

అతివేగం వల్ల ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతున్నారు.
- తిరుపతి/పాకాల, ఆంధ్రజ్యోతి





రుయా ఎమర్జెన్సీ నుంచి గీతమ్మను స్విమ్స్‌కు తరలిస్తున్న వైద్య సిబ్బంది, చికిత్స పొందుతున్న క్రిస్‌విల్

బెంగళూరుకు చెందిన నలుగురు మహిళలు తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా హోసూరులోని జీఆర్‌బీ ఫుడ్ ప్రొడెక్ట్స్‌లో పనిచేస్తున్నారు. వీరు శనివారం తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చారు. దర్శనానంతరం శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని దర్శించుకున్నారు. తిరుగుప్రయాణంలో పాకాల సమీపంలోని తోటపల్లి వద్ద జార్ఖండ్ రాష్ట్రం రాంచీనుంచి బెంగళూరుకు కొరియర్ లోడ్‌తో వెళ్తున్న కంటైనర్‌ను వెనుక వైపు బలంగా ఢీ కొన్నారు. దీంతో కారు కంటైనర్ కిందకు దూసుకెళ్లింది. ఏదో యాక్సిడెంట్ జరిగిందని గ్రహించిన లారీ డ్రైవర్ ఎన్‌హెచ్‌కు ఓవైపున లారీ నిలిపారు. అప్పటికే సుమారు 80 మీటర్లు కంటైనర్ ప్రయాణం చేసింది. ఇంతలో స్థానికులు, అటువైపు వెళ్లే వారు అప్రమత్తమై పోలీసులకు, 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు.అప్పటికే ఘోరం జరిగిపోయింది.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. కంటైనర్ కింద చిక్కుకున్న కారు నుజ్జునుజ్జుగా మారింది. అతికష్టం మీద బయటకు తీశారు. ఈఘటనలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చనిపోయినవారి కొందరి ముఖాలు గుర్తుపట్టలేనంతగా మారిపోయాయి. జాతీయ రహదారుల కోసం వినియోగించే క్రేన్ తీసుకొచ్చి అతికష్టం మీద కంటైనర్ నుంచి కారును వేరుచేశారు. గాయపడినవారి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. భీతావహంగా మారిన ఘోర ప్రమాదాన్ని చూసిన స్థానికులు తీవ్ర ఆవేదన చెందారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ప్రమాద స్థలానికి వెళ్లి పరిశీలించారు. కంటైనర్ డ్రైవరుతో మాట్లాడారు. ప్రమాదం ఎలా జరిగిందనేది తెలుసుకున్నారు. కలెక్టర్ స్విమ్స్‌కు వెళ్లి క్షతగాత్రులకు వైద్య సేవలను పరిశీలించారు.

మృతులు బెంగళూరుకు చెందిన విజయలక్ష్మి (50), సహాన (34), రజని (27), లేఖన్ గౌడ (10), తమిళనాడు రాష్ట్రం హోసూరుకు చెందిన కారు డ్రైవరు ఎస్.త్యాగరాజన్ (42). వీరిలో విజయలక్ష్మి, రజని, లేఖన గౌడ్ ఒకే కుటుంబానికి చెందిన వారు.

తీవ్రంగా గాయపడింది

గీతమ్మ (51), క్రిస్‌విల్ (15). వీరిలో క్రిస్‌విల్ తండ్రి త్యాగరాజన్ మృతిచెందారు.



కంటైనర్ డ్రైవర్‌ను అడిగి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్, ఎస్పీ

రోడ్డు ప్రమాదంపై సీఎం దిగ్భ్రాంతి

పాకాల మండలం తోటపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా సాయం అందించాలన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కూడా రోడ్డుప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారికిమెరుగైన వైద్యసేవలు అందించాలని రుయాస్పత్రి సిబ్బందికి సూచించారు.

ఐదుగురి మృతిపై డిప్యూటీ సీఎం ఆవేదన

పాకాల మండలం తోటపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం చెందడంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నానన్నారు. తిరుమల దర్శనం చేసుకొని తిరుగు పయనమైన భక్తులు ప్రమాదానికి గురి కావడం దురదృష్టకరమన్నారు.

కంటైనర్ కింద ఇరుక్కుపోయి..

చంద్రగిరి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాంచీ నుంచి బెంగళూరుకు కంటైనర్ డ్రైవర్ వికాస్ మెహతా, మరో డ్రైవర్ అభిజిత్ శనివారం బయలుదేరారు. సోమవారం మధ్యాహ్నం చంద్రగిరి మండలం గాదంకి టోల్‌ప్లాజా వద్ద భోజనం చేసి, 1.30 గంటల సమయంలో కొంతదూరం వెళ్లగానే వెనక పెద్ద శబ్దం రావడంతో కంటైనర్‌కు ఏదైనా ప్రమాదం జరిగిందేమో అని సుమారు 80 మీటర్లకుపైగా ముందుకెళ్లి రోడ్డు పక్కకు వాహనం ఆపారు. కిందకు దిగి చూడగా కంటైనర్ వెనుక కింద భాగంలో కారు ఇరుక్కుపోయి ఉంది.

గంట సమయం పట్టింది.



ప్రమాద స్థలానికి వెళ్లి చూస్తే కంటైనర్ కింద కారు ఇరుక్కుపోయి నుజ్జు నుజ్జు అయిఉంది. అప్పటికే క్రేన్ ద్వారా కారును బయటకు తీశారు. ఇద్దరికి ఊపిరి ఉండటంతో అతికష్టంపై బయటకు తీసి, ఆసుపత్రికి పంపించాము. ఆ ఇద్దర్ని తీయడానికే గంట పట్టింది.

- చంద్రశేఖర్‌రెడ్డి, తోటపల్లి

ఇంత ప్రమాదం ఎప్పుడూ చూడలేదు



ప్రమాదం జరగ్గానే పక్కనే మా ఊరి నుంచి వెంటనే వెళ్లా. కంటైనర్ కింద కారులో నుంచి ఇద్దరి అరుపులు వినిపించాయి. అందరితో కలిసి పోలీసులకు సాయం చేసి, మృతదేహాలను బయటకు తీశాం. ఇలాంటి ప్రమాదం ఎప్పుడూ చూడలేదు.

- కిరణ్, బయనపల్లి

చిత్తూరు పూర్వ కమిషనర్‌పై చర్యలు నిలిపివేత

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగర పాలక సంస్థకు చెందిన ఓ స్థలాన్ని నిబంధనలకు విరుద్ధంగా లీజుకు ఇచ్చిన అంశానికి సంబంధించి పూర్వ కమిషనర్ అరుణపై తదుపరి చర్యలను నిలిపివేస్తూ ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. కొంగారెడ్డిపల్లెలోని కూరగాయల మార్కెట్ యార్డు ప్రాంగణంలో 2,500 చదరపు అడుగులను ఓ వ్యక్తికి కేటాయించినట్లు ఆరోపణలువచ్చాయి. దీనిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ స్థలాన్ని కేటాయించడం నిబంధనలకు విరుద్ధమేనని విచారణాధికారులు సమర్పించిన నివేదికపై అరుణ రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. కౌన్సిల్ తీర్మానం మేరకే తాను పనిచేశానని, దీనిపై ఎలాంటి ప్రభుత్వ ఉత్తర్వులు లేవని తెలియజేశారు. ప్రస్తుతం సదరు స్థలం నగరపాలక సంస్థ అధీనంలోనే ఉందని పేర్కొన్నారు. దీంతో ఆమెపై తదుపరి చర్యల్ని ఉప సంహరించుకుంటున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. అరుణ ప్రస్తుతం కృష్ణా జిల్లా డీపీవోగా విధులు నిర్వహిస్తున్నారు.

టీడీపీ, వైసీపీ వర్గాల ఘర్షణ : ఆరుగురికి గాయాలు

యాదమరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. రెండు పార్టీలకు చెందిన ఆరుగురు కార్యకర్తలు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండలం చిన్నిరెడ్డిపల్లె పంచాయతీ పరిధిలోని 14కండ్రిగ గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త అబ్దుల్ అలియాస్ ఆదిల్.. 2029 సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆదివారం తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టాడు. దీన్ని చూసిన స్థానిక టీడీపీ కార్యకర్తలు అతడిని నిలదీసి, దాడి చేసినట్లు వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. రాత్రి ఈ విషయమై మరోమారు రెండు పార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకోవడంతో టీడీపీకి చెందిన మాలిక్‌తోపాటు మరో ఇద్దరు, వైసీపీకి చెందిన అబ్దుల్ మరో ఇద్దరు గాయపడి, చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి కేసు నమోదు చేయనున్నట్లు యాదమరి ఎస్ఐ ఈశ్వర్ తెలిపారు.



చికిత్స పొందుతున్న అబ్దుల్, మాలిక్


వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

పుంగనూరు రూరల్, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): వారపుసంతలో పట్టపగలే ఓ వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ జరిగింది. సంఘటన సోమవారం పుంగనూరులో జరిగింది. బాధితురాలి కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం కొండూరుకు చెందిన సరోజమ్మ (65) పుంగనూరు వారపు సంతలో కూరగాయలు కొనుగోలు కోసం వచ్చింది. కూరగాయల కొనుగోలు సమయంలో మరో వృద్ధురాలు మాటలు కలపడంతో సరోజమ్మ కూడా మాటలు కలిపింది. కొంత సమయానికి సరోజమ్మ తన మెడలోని బంగారు చైను (30గ్రాములు) కనిపించకపోవడంతో కేకలు వేసింది. అప్పటికే చోరీ చేసిన వృద్ధురాలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం పర్యటనలో వచ్చే అర్జీలకు ప్రాధాన్యం : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సీఎం కుప్పం పర్యటనలో వచ్చే అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఈ అంశంపై సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలు నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అర్జీల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై సీఎం పేషీ నుంచి తరచూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరుగుతోందని గుర్తుచేశారు.

ఖజానా ఉద్యోగుల సంఘ ఉపాధ్యక్షుడిగా నరేష్‌బాబు



చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఖజానా, లెక్కల శాఖ ఉద్యోగ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డి.నరేష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం విజయవాడలో ఎన్నికలు జరిగాయి. ఈయన చిత్తూరు జిల్లా ఖజానా ఉద్యోగుల సంఘ ఉపాధ్యక్షుడిగా 2008 నుంచి 2011 వరకు పనిచేసి.. ప్రస్తుతం రాష్ట్ర సంఘ అడహాక్ కమిటీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా అధ్యక్షుడు చెంగల్రాయుడు, కార్యదర్శి జి.పయని, కోశాధికారి ఎల్వీ చలపతి, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి సుబ్రహ్మణ్యం తదితరులు.. నరేష్ బాబును అభినందించారు.

గజదాడుల్లో పంటల ధ్వంసం

రామకుప్పం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండల పరిధిలోని అటవీ సమీప గ్రామ పొలాలు, తోటలపై గజదాడుల పరంపర కొనసాగుతోంది. నాలుగు రోజులుగా జంట ఏనుగులు దాడులకు పాల్పడుతూ రైతులకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. తాజాగా ఆదివారం రాత్రి సింగసముద్రం, చింతమానత్తం, కెంచనబల్ల గ్రామాల సమీప పొలాలు, తోటలపై స్వైరవిహారం చేశాయి. చంద్రశేఖరరెడ్డికి చెందిన టమోటా తోటను తొక్కి నాశనం చేశాయి. జయరామిరెడ్డికి చెందిన మామిడితోటలో ప్రవేశించి 5చెట్ల కొమ్మలను విరిచేశాయి. కాయలను తిన్నంతగా తిని నేలరాల్చాయి. అదేవిధంగా నారాయణప్పకు చెందిన వరి పొలం, రాధారెడ్డికి చెందిన టమోటా తోటను తొక్కి, మామిడి చెట్లను విరిచేశాయి.

తమిళనాడు వైపు తరిమేస్తాం..

శనివారం రాత్రి నుంచి నారాయణపురం తండా, రామాపురంతండాల సమీపంలోని నాయనచెరువు అటవీ ప్రాంతంలో తిష్ట వేసిన ఏనుగులను అటవీ అధికారులు, ట్రాకర్లు ఆదివారం రాత్రి తమిళనాడు వైపు తరిమేందుకు ప్రయత్నించారు. అయినా అవి సింగసముద్రం అటవీ ప్రాంతంలోని ఉండిపోయాయి. మంగళవారం కల్లా వాటిని తమిళనాడు అడవుల్లోకి తరిమేందుకు ప్రయత్నిస్తున్నట్టు అధికారులు తెలియజేశారు.



ఏనుగుల దాడుల్లో నేలకూలిన టమోటా తోట

బాధితులకు అండగా ఉంటాం: ఎస్పీ

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బాధితులకు అండగా ఉంటామని ఎస్పీ మణికంఠ స్పష్టం చేశారు. తన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 41 అర్జీలు వచ్చాయి. వీటిల్లో.. భూ తగాదాలపై 12, డబ్బు తగాదాలపై 8, కుటుంబ తగాదాలపై 8, వేధింపులపై 6, చీటింగ్‌పై 3, ఇంటి తగాదాపై, దారి సమస్యపై, చిన్నపాటి గొడవపై ఆస్తి తగాదాపై ఒక్కో అర్జీ చొప్పున ఉన్నాయి. కొన్ని సమస్యలను ఎస్పీ అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిపై సంబంధిత అధికారులకు ఫోన్ చేసి, నిర్ణీత సమయంలోగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ లేదని చెప్పినా..

కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం లేదని చెప్పినా.. బాధితులు తరలివచ్చారు. అధికారులెవరూ వినతిపత్రాలను తీసుకోకపోవడంతో వెనుదిరిగారు. కొందరు మాత్రం తమ సమస్యలపై ధర్నా చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఏడు నెలల పెండింగ్ బకాయిలను విడుదల చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. 2019 నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని ఉప కేంద్రాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్నామని చెప్పారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ చేయాలని, ఈపీఎఫ్‌వోను పునరుద్ధరించాలని, ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. సాయంత్రం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

కనీస వేతనమివ్వండి

కనీస వేతనాలను అమలు చేయాలని మిడ్‌డే మీల్స్ వర్కర్లు, స్వీపర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. కనీస వేతనంగా రూ.18వేలను ఇవ్వాలని కోరారు. నేతలు అమ్ములు, మంజులు, శారద, సుశీల, కమలమ్మ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వైద్య ఉద్యోగులు, మిడ్‌డే మీల్స్ వర్కర్లు, స్వీపర్లు

బధిరులకు స్మార్ట్ ఫోన్లు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బధిరులైన విభిన్న ప్రతిభావంతులు (మూగ, చెవిటి)లకు జేసీ విద్యాధరి స్మార్ట్ ఫోన్లను అందజేశారు. సోమవారం సాయంత్రం తన చాంబర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఏపీడీఏఎస్సీఏసీ మేనేజింగ్ డైరెక్టర్ విడుదల చేసిన రూ.4.50 లక్షల విలువైన 30 స్మార్ట్ ఫోన్లను అందజేసినట్లు విభిన్న ప్రతిభావంతుల, వయో వృద్ధుల సంక్షేమశాఖ ఏడీ శ్రీనివాసులు తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడల్, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఒంటరి ఏనుగు దాడులు

కల్లూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఒంటరి ఏనుగు దాడులు కొనసాగుతున్నాయి. మండలంలోని పాళెం, దేవళంపేట పంచాయతీల్లో ఆదివారం రాత్రి ఒంటరి ఏనుగు మామిడి, టమోటా పంటలను ధ్వంసం చేసింది. తూర్పు విభాగం అటవీప్రాంతం నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు కుమ్మరిపల్లి సమీపానికి చేరుకుంది. గ్రామంలోనే రైతుగోవిందయ్యకు చెందిన మామిడిచెట్లను విరిచేసింది. పశుగ్రాసాన్ని చెల్లాచెదురుచేసింది. అక్కడి నుంచి పాళెం సమీపానికి చేరుకున్న ఒంటరి ఏనుగు మాజీ జడ్పీటీసీ మురళీధర్ టమోటా పంటను, డ్రిప్ పైపులను ధ్వంసం చేసింది. అక్కడి నుంచి వచ్చిన మార్గంలోనే అడవిలోకి తిరుగుముఖం పట్టింది. ఒంటరి ఏనుగు దాడిలో ధ్వంసమైన పంటలను సోమవారం అటవీశాఖ సిబ్బంది పరిశీలించారు.

నేడు జడ్పీ సమావేశం

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో జరుగుతుందని సీఈవో రవికుమార్ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులతోపాటు ఉన్నతాధికారులంతా సమావేశానికి హాజరవుతారని తెలిపారు.

మద్యం మత్తులో ఒంటికి నిప్పు పెట్టుకుని మృతి

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఒంటికి నిప్పు పెట్టుకుని ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి సోమవారం మృతి చెందాడు. పుంగనూరు సీఐ సుబ్బరాయుడు కథనం మేరకు.. మండలంలోని సుగాలిమిట్ట పంచాయతీ చిన్నతండాకు చెందిన విశ్వనాథనాయక్ (37) పుంగనూరులోని కొత్తయిండ్లులో నివాసం ఉంటూ రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వ్యాపారం తగ్గడంతో అప్పులు తీసుకున్న వారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. అదే సమయంలో దంపతుల మధ్య కలతలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో ఈ నెల 25న మద్యం తాగి శరీరానికి నిప్పు పెట్టుకుని ఆత్మహత్యకు యత్నించాడు. తిరుపతిలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సమగ్ర శిక్ష (ఎస్ఎస్) ఏపీసీ వెంకటరమణ సూచించారు. సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, కథలు చెప్పడం, జీకే, క్విజ్, పేపర్ క్రాఫ్ట్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు.విద్యార్థులకు ఇది మంచి అవకాశమన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

WANTED

తిరుపతి ప్రముఖ లాడ్జి నందు రూమ్ సర్వీస్ చేయుటకు రూమ్‌బాయ్స్, హౌస్ కీపింగ్ కావలెను. జీతం:12,000/-(భోజనం+వసతి ఇవ్వబడును) Immediate Joiners Prefered. Cont: 99698 70407

AJT - 1187

CHANGE OF NAME

MY SON NAME MADDINENI REDDY TEERAJ (Old Name) S/o MADINENI JAYASREE R/o D No. 21-3-115/9, Satyanarayanapuram,Tirupati Dist, AP.INDIA. I Changed My Son Name to MADDINENI REDDY TEERAJ. Henceforth I Will be known as MADINENI REDDY TEERAJ S/o MADINENI JAYASREE (New Name).

AJT-2276

PLOT FOR SALE

తిరుపతి కలెక్టర్ ఆఫీస్ ప్రక్కన శాంభవి లే అవుట్ నందు తూర్పు పడమర దిక్కుల గల ప్లాట్లు అమ్మకానికి కలవు. సైజు 36x50 ఆసక్తికలవారు సంప్రదించండి. 98480 37385. (No Brokers కొనుగోలుదారులు మాత్రమే.)

AJT -200877

WANTED

మీరు 10th క్లాస్ పాస్ అయి వున్నారా! అయితే LIC భీమాసఖి (జీతం + కమిషన్) కొరకు సంప్రదించండి. AKCS రెడ్డి, LIC of India, Tirupati. Cell : 90599 19948.

AJT - 1183

PLOTS FOR SALE

6 లక్షలకే తిరుపతి IIT, IISER విద్యా సంస్థల ప్రక్కన ఫైనల్ అప్రూవ్డ్‌తో ప్లాట్లు డైరెక్ట్ ఓనర్ స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్ : 95027 74175/ 79959 92114.

AJT -1184

WANTED

Wanted teachers for Primary, Higher class All Subjects and Computers Teacher, for a Reputed School in S.N Puram, Tirupati. Contact: 92908 98331,70138 81383.

AJT-1186

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును. (రిజిస్టర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.

AJA- 237514

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

పీజీఆర్‌ఎస్‌కు వినతుల వెల్లువ

పలమనేరు, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపల్ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదికకు అర్జీలు వెల్లువెత్తాయి. 436 మంది తమ సమస్యలపై వినతిపత్రాలు అందించారు. కలెక్టరుతోపాటు, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, జేసీ విద్యాధరి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

తెల్లవారుజామున బస్సులు నడపాలి



పలమనేరు ఆర్టీసీ డిపో నుంచి ప్రతిరోజూ తెల్లవారుజామున ఉదయం 4.30 గంటల నుంచి చిత్తూరు, వేలూరు, తిరుపతి, బెంగళూరు వెళ్లే ప్రయాణికుల కోసం బస్సులు నడపాలి.

- పలమనేరు పరిరక్షణ సమితి నాయకులు

తాగునీరు సరఫరా చేయండి

పలమనేరు మున్సిపాలిటీలో ప్రస్తుతం ఆరు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఫలితంగా నీరు చాలక ఇబ్బందులు పడుతున్నాం. కనీసం మూడురోజులకు ఒకసారి సరఫరా చేయాలి.

- సామాజిక కార్యకర్త, మధుమోహన్‌రావు

దారిలో ఇల్లు కట్టేశాడు.. దారి చూపండి

గంగవరం మండలం జేఆర్ కొత్తపల్లి గ్రామంలో దారిలో ఓ వ్యక్తి ఇల్లు కట్టేశాడు. దీనివల్ల 15 ఇళ్లకు వెళ్లేందుకు దారిలేదు. దారిచూపి సమస్య పరిష్కరించండి.

- టి.సురేష్, జేఆర్.కొత్తపల్లి

లోఓల్టేజి సమస్య పరిష్కరించాలి



లో ఓల్టేజీ సమస్యతో ఇళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ కోసం నగదు కూడా చెల్లించాం. అయినా విద్యుత్ అధికారులు పట్టించుకోలేదు. న్యాయం చేయండి

-ఎస్‌ఆర్‌నగర్ వాసులు, గంగవరం మండలం

చింతచెట్టును తొలగించాలి

మా ఇంటి వద్ద చింతచెట్టు ప్రమాదకరంగా ఉంది. దాన్ని తొలగించాలి. అలాగే మా స్థలంలో పశువుల షెడ్డు దౌర్జన్యంగా నిర్మించారు. విచారణ జరిపి న్యాయం చేయండి.

- వెంకటేశు, కొత్తపల్లి, గంగవరం మండలం

పాసుపుస్తకం మంజూరు చేయండి

40 ఏళ్లుగా తన ఆధీనంలో 70 సెంట్ల భూమి ఉంది. తరాలుగా సాగుచేసుకుంటున్నాం. ఆ భూమిని ఆన్‌లైన్ చేసి పట్టాపాసుపుస్తకం మంజూరు చేయాలి.

వి.నాగరాజు, పెద్దారికుంట, పెద్దపంజాణి మండలం

వితంతు పింఛను ఇప్పించండి



నా భర్త 5నెలల క్రితం మరణించాడు. వితంతు పింఛను మంజూరు చేయించి ఆదుకోండి.

- గుర్రమ్మ, పెనుగొలకల గ్రామం, పెద్దపంజాణి మండలం

బియ్యం ఇవ్వలేదు

పలమనేరు మున్సిపాలిటీలోని 17వ వార్డులో ఏప్రిల్ మాసం బియ్యం ఇప్పటి వరకు ఇవ్వలేదు. విచారణ జరిపి బియ్యం ఇచ్చేలా చూడండి

- బియ్యం కార్డుదారులు

వృద్ధాప్య పింఛను ఇచ్చి ఆదుకోండి



నా వయసు 75. ఇప్పటివరకు పింఛను రాలేదు. పలుమార్లు అర్జీలు ఇచ్చినా మంజూరు కాలేదు. మీరైనా పింఛను మంజూరు చేసి ఆదుకోండి సారూ.

- పి.చెంగమ్మ, పలమనేరు

అయూబ్‌ఖాన్‌కు జాతీయ ఎక్సలెన్స్ అవార్డు



చీఫ్ జస్టిస్ కేజీ బాలకృష్ణన్ నుంచి అవార్డు అందుకుంటున్న అయూబ్‌ఖాన్

పుంగనూరు, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఏపీజే అబ్దుల్ కలాం హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అయూబ్‌ఖాన్ సేవలను గుర్తించి జాతీయ ఎక్సలెన్స్ అవార్డును చీఫ్ జస్టిస్ కెజీ. బాలకృష్ణన్, సుప్రీంకోర్టు బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ అగర్వాల్ అందజేసి అభినందించారు. సోమవారం న్యూఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో జరిగిన 11వ ఢిల్లీ రత్న అవార్డు వార్షికోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్. అంబేద్కర్ గ్లోబల్ ఫౌండేషన్, భారత మన్స్‌ట్రస్ట్, ఇండియన్ గెలాక్సీ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో అవార్డులు, పురస్కారాలు ప్రకటించారు. ఈసందర్భంగా అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ ట్రస్టు సేవలు ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా రెండేళ్లుగా హర్యానా. ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, నోయిడాలోని మురికివాడల్లో నివసిస్తున్న పేదలకు మెడికల్ క్యాంపులు తదితర సేవలు అందించామన్నారు. ట్రస్టు సేవలు గుర్తించి జాతీయ స్థాయి ఎక్సలెన్స్ అవార్డు, పురస్కారం లభించిందన్నారు. ఇది తనపై మరింత బాధ్యత పెంచిందని సేవా కార్యక్రమాలు ఇంకా విస్తృతం చేస్తామని వివరించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు



కల్లూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సోమవారం పాఠశాల ఆవరణంలో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు సాధ్యమన్నారు. టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను మిగిలిన విద్యార్థులు ఆదర్శంగా తీసుకో వాలన్నారు. పాఠశాలలో పది ఫలితాల్లో 73శాతం సాధించడం పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సయ్యద్ సాహెబ్ వలి, ఎస్‌ఎంసీ ఛైర్ పర్సన్ అక్బర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వి.కోట తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

వి.కోట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వి.కోట తహసీల్దార్‌గా ఉదయసంతోష్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన పార్వతి చిత్తూరు కలెక్టరేట్‌కు బదిలీకాగా, ఆమె స్థానంలో పలమనేరు ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న ఉదయసంతోష్‌ను వి.కోట ఇన్‌చార్జ్ తహ సీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. రెవిన్యూ అధికారులతో పాటు వీఆర్‌వోలు, ఇతర సిబ్బంది అయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.

రైలునుంచి జారి పడి గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

కుప్పం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కుప్పం-మల్లానూరు రైల్వే స్టేషన్ల మధ్య రైలులో ప్రయాణం చేస్తున్న గుర్తు తెలియని వృద్ధురాలు పట్టాలపై జారిపడి మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 9000716436, 9494228854 అనే నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని వారు కోరారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

కుప్పం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని ఆర్‌పేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (ఉర్దూ)లో కుప్పం ప్రభుత్వ గ్రంథాలయం ఆధ్వర్యంలో పిల్లలకు ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర బాబు సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి శిబిరాలు పిల్లల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి ఎంతో దోహదపడుతాయని చెప్పారు. గ్రంథాలయాధికారి సత్యవాణి మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరం జూన్ 6వ తేదీ వరకు జరుగుతుందని, పిల్లలు వినియోగించుకోవాలని కోరారు. పిల్లలకు ఈ శిబిరంలో వివిధ అంశాలపై సృజనాత్మక శిక్షణ ఇచ్చారు.

ఏకగ్రీవంగా ముగిసిన టీడీపీ సంస్థాగత ఎన్నికలు



పెద్దచెల్లారగుంటలో జరిగిన ఎన్నికలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నాయకులు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో వారం రోజులుగా జరి గిన టీడీపీ సంస్థాగత ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. సోమవారం గొల్లచీమనపల్లెలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో పంచాయతీ అధ్యక్షుడిగా అమరనాథరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. పెద్దచెల్లార గుంట పంచాయతీ అధ్యక్షుడిగా జయచంద్రప్రకాష్, ప్రధానకార్యదర్శిగా ఈశ్వర్ రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వీరిని పలువురు టీడీపీనాయకులు అభినందించారు.

పోలీస్ గ్రీవెన్స్‌డే రేపటికి వాయిదా

పుంగనూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో ప్రతి మంగళవారం పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ నిర్వహించే పోలీస్ గ్రీవెన్స్‌డే కొన్ని అనివార్య కారణాలతో ఈనెల 30 బుధవారం నాటికి మార్చినట్లు సీఐ సుబ్బరాయుడు సోమవారం తెలిపారు.

వైభవంగా శివపార్వతుల ఊరేగింపు



సోమలలో త్రిశూలం ఊరేగింపులో ఉభయదారులు

సోమల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం శివపార్వతుల ఉత్సవమూర్తులను పట్టణంలోని పురవీధుల్లో ఊరేగించారు. ఆలయంలో ఉదయం దిగువవీధి ఉభయ దారుల ఆధ్వర్యంలో అభిషేకపూజలు జరిపారు. అనంతరం స్వామి వారి త్రిశూలాన్ని నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. అర్చకుల ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. రాత్రి శివపార్వతుల ఉత్సవమూర్తులను పల్లకీలో అలంకరించి చెక్క భజనలు, కోలాటాలు, బాణసంచా వేడుకల నడుమ ఊరేగించారు. ఈ కార్యక్రమాలను ఆలయ. దర్మకర్త బీవీ. సోమశేఖర్ పర్యవేక్షించారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు



రామకృష్ణాపురంలో చేతి బోరును బాగుచేస్తున్న దృశ్యం

సోమల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కిరణ్‌తేజ, ఎంపీడీవో నారాయణ తెలిపారు. సోమవారం ఆవులపల్లె పంచాయతీ రామకృష్ణాపురంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు విన్నవించారు. స్పందించిన అధికారులు గ్రామంలోని చేతి బోరు మరమ్మతులు చేయించి తాగునీటి సౌకర్యం కల్పించారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అరాచకం నుంచి అభివృద్ధివైపు పయనం:టీడీపీ



ర్యాలీలో ధన్యవాదాలు తెలియజేస్తున్న మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్

కుప్పం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ప్రత్యేకించి కుప్పం పురపాలక సంఘం ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే పాలనలో అరాచకంనుంచి అభివృద్ధివైపు వేగంగా పయనిస్తోందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అన్నారు. కుప్పం మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని టీడీపీ కైవసం చేసుకున్న నేపథ్యంలో సోమవారం ఎన్నిక ముగిసిన తర్వాత టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. 2021లో అంతులేని విధ్వంసంతో అరాచకంగా అప్పటి అధికార వైసీపీ అధికారాన్ని దుర్వినియోగం చేసి మరీ కుప్పం మున్సిపాలిటీని గెలిచిందని విమర్శించారు. టీడీపీ కార్యకర్తల కిడ్నాపులు, మహిళలతో సహా తప్పుడు కేసుల బనాయింపుతో అక్రమంగా జైళ్లకు తరలింపు, దాడులు, దౌర్జన్యాలు అన్నింటినీ కుప్పం ప్రజలు అప్పట్లో చవిచూశారన్నారు. ఈరోజు ఎన్డీయే పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధినాయకత్వంలో కుప్పం పురపాలక సంఘం అభివృద్ధికి రూ.1200 కోట్లతో ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని చెప్పారు. దేశంలోనే కుప్పం మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ అభివృద్ధిని, చంద్రబాబు నాయకత్వాన్ని చూసి అభివృద్ధిలో పాలుపంచుకునేందుకు ప్రతిపక్ష వైసీపీ కౌన్సిలర్లు కొందరు మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి మద్దతు ప్రకటించి గెలిపించారన్నారు. అంతకుముందు వైసీపీనుంచి చైర్మన్‌గా ఎన్నికైన డాక్టర్ సుధీర్ సైతం చంద్రబాబు నాయకత్వంలో ప్రజలకు మంచి జరుగుతుందన్న ఉద్దేశంతోనే పదవికి రాజీనామా చేసి పార్టీలో చేరారన్నారు. వీరందరికీ పేరుపునా ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. అలాగే తమ పార్టీ కౌన్సిలర్లు జిమ్ దాము, సోమశేఖర్ చైర్మన్ పదవిని ఆశించినా, అధినేత నిర్ణయాన్ని తలదాల్చి సహకరించినందుకు ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు సహాయ సహకారాలతో, పార్టీ నాయకులు, శ్రేణుల మద్దతుతో మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవడం ఎంతో ఆనందంగా వుందన్నారు. వారందరితోపాటు ప్రజలకు కూడా వారు ధన్యవాదాలు తెలిపారు.మున్సిపల్ చైర్మన్ వి.సెల్వరాజ్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన కౌన్సిలర్లకు, నాయకులకు, పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో, కౌన్సిలర్ల సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కుప్పం మున్సిపల్, కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల టీడీపీ అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, బాబునాయుడు, విశ్వనాథ నాయుడు, ఆనందరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, గుడుపల్లె మాజీ ఎంపీపీ చంద్రశేఖర్, కన్నన్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రక్షణశాఖ ఆదేశిస్తే పాక్‌తో యుద్ధానికి సిద్ధం

ఉగ్రదాడి మృతులకు కొవ్వొత్తులతో మాజీ సైనికుల నివాళి



పుంగనూరులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికులు

పుంగనూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రక్షణశాఖ ఆదేశిస్తే పాకిస్థాన్‌తో యుద్ధంలో తలపడేందుకు సిద్ధంగా ఉన్నామని పుంగనూరు మాజీ సైనికులు స్పష్టం చేశారు. సోమవారం రాత్రి స్థానిక ఇందిరా సర్కిల్ నుంచి ప్రైవేటు బస్టాండ్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడిని ఖండిస్తూ, కశ్మీరు పహల్గాం మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాజీ సైనికుడు, విశ్రాంత డీఎస్పీ కె.సుకుమార్‌బాబు మాట్లాడుతూ మృతుల పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని చెప్పారు. ఉగ్రవాదం పూర్తిగా అంతం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు రెడ్డెప్ప, కృష్ణప్ప, ఎస్.సుబ్రమణ్యం, దేవరాజు, హనుమంతప్ప, నానబాల గణేశ్, శ్రీనివాసులు, చిన్నా, సతీశ్ , జవహర్, ప్రతాప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి చంద్రబాబు భరోసా



చంద్రబాబును కలిసిన రామచంద్ర కుటుంబం

రామకుప్పం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): తీవ్ర ఆర్థిక ఇబ్బందులో ఉన్న రామకుప్పం మండలం కృష్ణరాజపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త రామచంద్రగౌడు కుటుంబాన్ని ఆదుకుంటానని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. కార్యకర్త కథనం మేరకు.. రామచంద్రగౌడు ప్రతికూల పరిస్థితుల్లో గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో ఆర్థికంగా కొంత నష్టపోయారు. అదేసమయంలో సాగుచేసిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక నష్టాలు చవిచూశాడు. పెద్ద కుమారుడుకి కంటి సమస్య తలెత్తడంతో అప్పులు చేసి ఆపరేషన్ చేయించాడు. రెండో కుమారుడికి కూడా అనారోగ్య సమస్య ఎదురవడంతో చికిత్స కోసం మరింత అప్పులు చేయాల్సి వచ్చింది. ఆరోగ్యరీత్యా, అప్పుల రీత్యా కుటుంబం గడవడం గగనమైంది. దీంతో ఆదివారం అమరావతిలో చంద్రబాబును కలిసి ఆదుకోవాలని విన్నవించాడు. స్పందించిన సీఎం ఆదుకుంటానని భరోసా ఇచ్చాడు.

శివపార్వతుల కల్యాణ మండపానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న దాతలు

సోమల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సోమలలో వెలసిన స్వయంభేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మాణంలోని శివపార్వతుల కల్యాణ మండపానికి పలువురు దాతలు విరాళాలు అందజేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త బీవీ.సోమశేఖర్ తెలిపారు. సోమవారం స్థానిక శెట్టివారివీధికి చెందిన శెట్టివారి మల్లికార్జున, లింగమ్మ దంపతులు రూ.10,116, కే.ప్రభాకర్‌రెడ్డి (మదనపల్లె) రూ.10,116, మారసాని చెన్న కేశవులు, సుందరమ్మ (సోమల)రూ.10,116, మారసాని మల్లప్ప, శివమ్మ (బుంగా వారిపల్లె) రూ.10,116, చిన్నిన్నిగారి రామకృష్ణ, వెంకటమ్మ (సోమల)రూ.10,116, వీరమలుగారి శంకరయ్య, మంజుల దంపతులు రూ. 10, 116 విరాళాలు అందజేశారు. వీరితో పాటు పలువురు దాతలు సిమెంట్, వైరింగ్, లైటింగ్‌కు శంకరయ్య, శెట్టివారి సురేంద్ర ఖర్చులతో పనులు చేపట్టినట్లు వివరించారు.

గంగజాతరకు చల్లా రామచంద్రారెడ్డికి ఆహ్వానం



చల్లా బాబును సత్కరిస్తున్న ఇరుపాక్షమ్మ ఆలయ కమిటీ సభ్యులు

రొంపిచెర్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కల్లూరు ఇరుపాక్షమ్మ ఆలయ కమిటీ సభ్యులు పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా ఆయన ఇంటి వద్ద కలిశారు. శాలువ కప్పి సత్కరించారు. వచ్చే నెల 11, 12 తేదీల్లో జరగనున్న గంగజాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. ● పులిచెర్ల మండలం కొమ్మిరెడ్డిగారిపల్లె గ్రామంలోని కోందండ రామస్వామి ఆలయంలో ఈనెల 30వతేదీన జరగనున్న మహాకుంభాభిషేకం, సీతారాముల కళ్యాణోత్సవానికి రావాలని టీడీపీ నాయకుడు చెంగ్రాయనాయుడు చల్లారామచంద్రారెడ్డికి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ కార్యక్రమంలో ఇరుపాక్షమ్మ కమిటీ సభ్యులు రాగాల నాగరాజ, గురవయ్య, శ్రీనివాసులు, తుపాకుల సుబ్రమణ్యం, శంకరయ్య, బాస్కర్, గోపి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



పుంగనూరు, కుప్పంలో రిలేనిరహార దీక్షలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

పుంగనూరు రూరల్/ కుప్పం ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ పుంగనూరు ఆర్టీసీ డిపో కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో ముందు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1/2019 భద్రత సర్క్యులర్‌ను అమలు చేయాలని, ఉద్యోగులకు డబుల్ డ్యూటీ వేతనం పెంచాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ ద్వారా వేతనాలు ఇవ్వాలని, మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు ఇవ్వాలని, ఈహెచ్‌ఎస్ స్థానంలో పాత వైద్య విధాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘనాయకులు ఎంజే.బాబు, అశోక్‌కుమార్, రెడ్డెప్ప, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు. ● కుప్పం డిపో ఎదుట ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. యూనియన్ డిపో అధ్యక్షుడు ఎస్.మునస్వామి, కార్యదర్శి ఈ.జయపాల్, సంయుక్త కార్యదర్శి జి.మునెప్ప నాయకత్వంలో దీక్షలు కొనసాగాయి. యూనియన్ జిల్లా అధ్యక్షుడు వేలు, ఉపాధ్యక్షుడు జె.శ్రీను, కార్యదర్శి జేవీ.భాస్కర్, సంయుక్త కార్యదర్శి యాగం రెడ్డి మాట్లాడారు. ఎన్ఎంయూఏ నాయకులు మోహన్, రహంతుల్లా, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఊపిరి పోసిన దోస



రొంపిచెర్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) రొంపిచెర్ల మండలంలో ఉద్యానపంట అయిన దోస సాగు నష్టపోతున్న రైతులకు ఊపిరి పోసింది. మండలంలో టమోట పంట తర్వాత రైతులు వ్యాపారపంటగా దోస సాగు విస్తారంగా చేస్తారు. మం డలంలో దోస 840 ఎకరాలు సాగుచేసినట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. మోటుమల్లెల, గానుగచింత, పెద్దమల్లెల, బొమ్మయ్యగారిపల్లె పంచా యతీల్లో విస్తారంగా దోస సాగు చేశారు. గత ఏడాది మంచి ధరతో లాభాలు రావడంతో ఈ ఏడాది విస్తీర్ణం పెరిగింది. అయితే ధరలు పూర్తిగా తగ్గిపోయి అమ్మకాలు లేక నష్టాలబాట పట్టారు. ఈ క్రమంలో ప్రస్తుతం కేజీ రూ.5లుగా ఉన్న దోసకాయలు ప్రస్తుతం రూ.10లకు పెరిగింది. దీంతో నష్టాల నుంచి గట్టెక్కుతామని దోస రైతులు ఊపిరి తీసుకుంటున్నారు.

శిథిలావస్థలో పుంగనూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

- బ్రిటీష్ కాలం నాటి కట్టడంలోనే కార్యకలాపాలు
- వానొస్తే ఉరుస్తుంది
- రికార్డుల నిర్వహణపై నీలినీడలు
- పట్టించుకోని అధికారులు



బ్రిటీషు కాలంలో నిర్మించిన పుంగనూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

పుంగనూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఖజానాకు అత్యధిక ఆదాయం తెచ్చిపెట్టే రిజిస్ట్రేషన్ శాఖలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అధ్వానంగా ఉంది. పుంగనూరులో బ్రిటీష్ కాలం నాటి భవనాల్లోనే రిజిస్ట్రేషన్ కార్యాలయం కొనసాగుతుండటంతో అది ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది. భవనం శిథిలావస్థకు చేరడంతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించడానికి అవస్థలు పడుతున్నారు. అదే సమయంలో ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించి కోట్లాది రూపాయల విలువైన సమాచారం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో భద్రంగా ఉండే పరిస్థితులు కనిపించడంలేదు.

పుంగనూరులో బ్రిటీషు కాలంలో స్థానిక నాగపాళ్యం చర్చి పక్కన పైకప్పు పెంకులతో చిన్నగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మించారు. అప్పటి నుంచి ఎన్నో ప్రభుత్వాలు మారినా ఈ కార్యాలయం మాత్రం మారలేదు. స్వాతంత్ర్యం అనంతరం కూడా కొంతకాలం పుంగనూరు జమీందారీ వ్యవస్థ కొనసాగింది. విలువైన ప్రభుత్వ, జమీందారీ, వక్ఫ్, ఆలయ ఆస్తులు పుంగనూరు నియోజకవర్గంలో ఉన్నాయి. ప్రస్తుతం పుంగనూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో పుంగనూరు పట్టణ, రూరల్ మండలం, చౌడేపల్లె, సోమల, పెద్దపంజాణి, సదుం పార్ట్, అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలాలున్నాయి. వందేళ్ల క్రితం నిర్మించిన ఇరుకైన చిన్న భవనం కావడంతో కక్షిదారులే కాకుండా సిబ్బంది కూడా ఇబ్బంది పడుతున్నారు. వర్షం వస్తే ఉరుస్తోంది. అత్యంత కీలకమైన రికార్డులు, కంప్యూటర్ వంటి ఆధునిక పరికరాలు పెట్టుకోవడం కష్టంగా ఉంది. ఇటీవల కొంతమంది దాతలు, లేఖర్లు కలిసి కార్యాలయంలో ప్రజలు ఉండటానికి కొంతస్థలంలో ఎండ, వర్షం నుంచి రక్షణకు తాత్కాలికంగా రేకులు వేశారు. వ్యక్తిగత, ప్రభుత్వ ఆస్తుల సరిహద్దులు తదితర విషయాల్లో వివాదాలకు తావులేకుండా నివారించే కీలక రికార్డులు తడిచి పాడయ్యే అవకాశాలున్నాయి. దీనికితోడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రాత్రి వేళల్లో కాపలాదారులు లేకపోవడంతో రికార్డుల భద్రతపై ప్రజల్లో ఆందోళన నెలకొంది. నాగపాళ్యం పట్టణంలోని అన్నివీధులకంటే చాలా ఇరుకుగా ఉండటం, ద్విచక్ర వాహనాలు వెళ్లలేని దుస్థితితో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. నాలుగు చక్రాల వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం స్పందించి ప్రజలకు సౌకర్యంగా ఉన్న ప్రాంతంలో శాశ్వత రిజిస్ట్రార్ కార్యాలయ భవనం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు త్వరగా పరిష్కరించాలి: కమిషనర్



బాధితుల నుంచి అర్జీ స్వీకరిస్తున్న నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. చిత్తూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో బాధితుల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఇంజనీరింగ్‌కు నాలుగు, రెవెన్యూ మూడు, పబ్లిక్ హెల్త్‌కు రెండు చొప్పున మొత్తం తొమ్మిది అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చడం 'కూటమి'కే సాధ్యం: టీడీపీ

గుడిపాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమవుతుందని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. సోమవవారం మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ సూపర్ సిక్స్ అమలులో ముందంజలో ఉందన్నారు. మత్స్యకారులకు ఆర్థిక సాయాన్ని రూ.20వేలకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని చెప్పారు.

'అపోలో వద్దు.. ప్రభుత్వాస్పత్రే ముద్దు'



సంతకాలు పెడుతున్న స్థానికులు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా దండ యాత్ర పేరుతో గాంధీ విగ్రహం వద్ద ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి శోభారాణి, టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ షణ్ముగం ఆధ్వర్యంలో సోమవారం సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. బలహీనవర్గాల ప్రజల పట్ల పెనుశాపంగా మారిన అపోలో ఒప్పందాన్ని రద్దుచేసి, ప్రభుత్వం ఆధ్వర్యంలోనే ఆస్పత్రిని నిర్వహించాలని డిమాండ్ చేస్తూ జనం సంతకాలు పెట్టారు. మాజీ కార్పొరేటరు సీఎం విజయ, మొదలియార్ సంఘం నేత సీఎం త్యాగ, బీజేపీ నాయకులు జయకుమార్, జనసేన నేత దయారాం, వైసీపీ నేత అప్పోజి తదితరులు పాల్గొన్నారు.

రోజాను కలిసిన వైసీపీ నాయకులు

విజయపురం/నగరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ఆర్కే రోజాను నగరిలోని ఆమె స్వగృహంలో వివిధ పార్టీ పదవులు పొందిన విజయపురం మండలంలోని వైసీపీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నగరి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎం.అగరం సర్పంచ్ సుధాకర్‌ను పరామర్శించారు. నాయకులు గుణశేఖర్‌రెడ్డి, శేఖర్‌రాజు, శివరాజు, సతీష్‌యాదవ్, గోవర్ధన్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'టెన్త్'లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం



బంగారుపాళ్యం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో మంగళపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు ఏపీ హేమ, హేమశ్రీ, పునీత్ సాయి తదితరులు ప్రతిభ చూపారు. వీరిని సోమవారం పాఠశాలలో సన్మానించారు. రాష్ట్ర సర్పంచుల సంఘ కార్యదర్శి కుప్పాల మురళి, పూర్వ విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయులైన బిర్లా నాయుడు, మోహన్ రాజు, హెచ్ఎం రాజ్యలక్ష్మి, మాజీ సర్పంచు భాస్కర్ నాయుడు, ఎస్ఎంసీ చైర్మన్ రమేష్ బాబు, మోహన్ నాయుడు, మనోరంజని, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో టీడీపీ నాయకుడి మృతి



చంద్రశేఖర్ (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలం టీడీపీ మాజీ ప్రధాన కార్యదర్శి కవి అలియాస్ చంద్రశేఖర్(60) అనారోగ్యంతో సోమవారం మధ్యాహ్నం మృతి చెందారు. మంగళవారం స్వగ్రామమైన మొగిలి వెంకటగిరిలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబీకులు తెలిపారు. చంద్రశేఖర్ మృతి పార్టీకి తీరని లోటని టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్ పేర్కొన్నారు.

తెలుగు సాహితీ సంబరాలకు కార్వేటినగరం టీచర్‌కి ఆహ్వానం

వెదురుకుప్పం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు హాజరుకావాలని కార్వేటినగరానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు, కీర్తి పురస్కార గ్రహీత గిరిబాబుకు సోమవారం ఆహ్వానం అందింది. పైగా సంబరాలకు ఆర్గనైజింగ్ కార్యదర్శిగా తనను నియమించారని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐఎస్‌వో గుర్తింపు పొందిన మొదటి సాహితీ సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ కళావేదిక ఆధ్వర్యంలో మే 10,11 తేదీల్లో ఏలూరు పట్టణంలో ఈ సంబరాలు జరుగుతాయన్నారు.

శాస్త్రోక్తంగా ద్రౌపది కల్యాణోత్సవం



ద్రౌపది అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళుతున్న ఉభయదారులు

వెదురుకుప్పం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): చవటగుంటలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ మహాభారతం ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ద్రౌపది కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వెదురుకుప్పానికి చెందిన పేట వంశీకృష్ణారెడ్డి, పి.మురళీకృష్ణారెడ్డి, పేట నీరజారాధాకృష్ణారెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి వీధినాటకంలో ద్రౌపది కల్యాణోత్సవానికి చవటగుంటకు చెందిన బండి మణెమ్మ, భాస్కర్‌రెడ్డి, బండి జాన్సీ, కమలేశ్వరరెడ్డి, బండి దేవీప్రియ, ఢిల్లీ ప్రసాద్‌రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. అమ్మవారి పల్లకి ప్రదక్షిణ సేవకు కార్వేటినగరం మండలం కేపీ అగ్రహారం సర్పంచ్ కామసాని శేఖర్‌రెడ్డి ఉభయదారుగా వ్యవహరించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

మట్టి తరలింపును తక్షణం ఆపించండి

● తహసీల్దార్‌కు గుండ్రాజుకుప్పం దళితుల వినతి

నగరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): క్వారీ నుంచి మట్టి తరలింపును తక్షణం ఆపించాలని గుండ్రాజుకుప్పం దళితవాడ యువకులు సోమవారం తహసీల్దార్ ధనంజయులుకు వినతిపత్రం అందించారు. జాతీయ రహదారికి ఈ మట్టిని తరలిస్తున్నారని, మైనింగ్ నుంచి అనుమతులు తీసుకున్న పత్రాలను గతంలో చూపించడం జరిగిందని తహసీల్దార్ తెలిపారు. క్వారీ వద్దకు వెళ్లి ఈ అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

పెరుమాల్‌గుంటను కాపాడాలి



తహసీల్దార్‌కు విన్నవిస్తున్న ఈడిగపల్లె మహిళలు

వెదురుకుప్పం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఈడిగపల్లె సమీపంలో ఉన్న పెరుమాల్‌గుంటను ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని సోమవారం తహసీల్దార్ నాగరాజుకు స్థానికులు వినతిపత్రమిచ్చారు. గ్రామదేవతకు పూజా కార్యక్రమాలకు ఉపయోగించే ఈ స్థలంపై ఆక్రమణదారుల కన్నుపడిందని చెప్పారు. ● కార్వేటినగరంలో రేషన్ సరుకులు సక్రమంగా అందించేలా చూడాలని తహసీల్దార్‌ను ముస్లిం మహిళలు కోరారు.

కుప్పం మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్‌కు ఎంపీ శుభాకాంక్షలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన సెల్వరాజ్‌కు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. పార్టీకోసం పనిచేసే వారికి టీడీపీ సముచిత స్థానం కల్పించి, గౌరవిస్తుందని పేర్కొన్నారు. బీసీ వర్గానికి చెందిన సెల్వరాజ్ సేవలను గుర్తించి తగిన ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. సీఎం చంద్రబాబు నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలకు సేవలందించి, చైర్మన్ పదవికి వన్నెతేవాలని సూచించారు. ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారుల సమన్వయంతో కుప్పం పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

వ్యసనాలకు బానిస కావద్దు

యువతకు సీఐ సూచన

పూతలపట్టు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిస కావద్దని యువతకు పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ సూచించారు. సోమవారం రాత్రి ఆకనంబట్టు దళితవాడలో తన సిబ్బందితో కలిసి పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించుకోవాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనపై దృష్టి పెట్టాలని సూచించారు. సర్పంచ్ ఎంఎస్ మణి, ఏఎస్ఐ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

డైయింగ్ యూనిట్లపై రాజకీయం తగదు: టీడీపీ



సమావేశంలో ప్రసంగిస్తున్న టీడీపీ నాయకులు

నగరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): డైయింగ్ యూనిట్లపై రాజకీయం తగదని నగరిలోని మొదలియార్ వర్గానికి చెందిన టీడీపీ నాయకులు అన్నారు. నగరి టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మీడియాతో మాట్లాడారు. నాడు.. వైసీపీ లీడర్లకు చెందిన డైయింగ్ యూనిట్ల నుంచి వెలువడే వ్యర్థాలను కాలువలు, చెరువులు, నదిలోకి వదిలి.. నేడు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ హయాంలో యూనిట్ల నుంచి మెయింటనెన్స్ కోసం వసూలు చేసిన నగదుతో కరెంటు బిల్లు కట్టి, ఈటీపీని సక్రమంగా నడిపించి ఉంటే నేడు కాలుష్య సమస్య వచ్చేది కాదన్నారు. టీడీపీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసన్, నాయకులు కరుణ,మదివానన్, వేలు, రజనీకాంత్, డయ్యింగ్ యూనిట్ ప్రెసిడెంట్ ఏజీమణి, దేవరాజన్, కార్తికేయన్, ప్రకాష్, హేమచంద్రన్ పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించండి



← మందులను పరిశీలిస్తున్న ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ సుదర్శన్

యాదమరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్ సూచించారు. యాదమరి మండలంలోని గుట్టకింద హరిజనవాడలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా అందిస్తున్న 104 సేవలను సోమవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఉచితంగా అన్నిరకాల వైద్యపరీక్షలు చేసి మందులు అందించేందుకే ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, మహిళా ఆరోగ్య కార్యకర్త అమ్ములు, ఆశా కార్యకర్త అంజలి, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఉపాధి' పని దినాలు 200 రోజులకు పెంచాలి

వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సుబ్బారావు తదితరులు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పని దినాలు 200 రోజులకు పెంచి, ఒక రోజు వేతనం రూ.600 ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు డిమాండ్ చేశారు. సోమవారం తగ్గువారిపల్లెలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. పనిచేసిన 15 రోజుల్లోపు కూలి ఇవ్వాలని, లేకుంటే 0.2 శాతం వడ్డీవేసి ఇవ్వాలన్నారు. 2012 నుంచి పని ముట్లను అందించడం లేదని చెప్పారు. ఉపాధి హక్కులను కాపాడుకోవడానికి వచ్చేనెల 20వ తేదీన జరిగే సమ్మెలో కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు మాట్లాడుతూ.. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ బీమా ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా రైతు సంఘ కార్యదర్శి శంకరన్, ఉపాధి కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం



ఐరాల గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

ఐరాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఐరాల గ్రంథాలయంలో సోమవారం నుంచి విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. విద్యార్థులతో పుస్తకాలను చదివించడం, డ్రాయింగ్ వేయించడం, చిన్నచిన్న ఆటలు ఆడించడం వంటివి చేయిస్తామని గ్రంథాలయ అధికారి సుజాత తెలిపారు. జూన్ ఆరో తేదీవరకు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

ఇంటి స్థలాలు మంజూరు చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

గుడిపాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రినాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ జయంతికి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ రామభద్రాపురం ఎస్సీకాలనీలో 28 మందికి ఇళ్ల స్థలాలు లేక పదేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మాజీ సర్పంచ్ పయణి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

పెనుమూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి సూచించారు. సోమవారం తన కార్యాలయంలో జరిగిన కిశోర వికాసంపై ఒక్క రోజు శిక్షణ తరగతుల్లో ఆయన ప్రసంగించారు. ఎంఈవో భాస్కర్‌నాయుడు, ఏపీఎం చిరంజీవి, అంగన్వాడీ సూపర్‌వైజర్ నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలు విధిగా చెత్త సేకరించాలి: క్లాప్ మిత్రలు గ్రామాల్లో విధిగా తడి, పొడి చెత్తను సేకరించాలని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని క్లాప్‌మిత్రలతో జరిగిన సమావేశంలో వారు ప్రసంగించారు. చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించి, ఎరువుగా మార్చాలన్నారు. సెక్రటరీలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయండి

పాలసముద్రం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిశోరి బాలికలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో అంగన్వాడీ, ఆరోగ్యశాఖ సిబ్బందితో ఆమె సమీక్షించారు. ఎంఈవో రాజేంద్రప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ: వనదుర్గాపురం, శ్రీకావేరిరాజుపురం పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనులను విద్యావతి తనిఖీ చేశారు. సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. ఏపీవో మార్గరేట్ పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయ అర్చక, పండితులకు సన్మానం

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఉగాది పురస్కారాలు అందుకున్న ఆలయ ఉప ప్రధాన అర్చకుడు గణేష్ గురుకుల్, వేద పండితుడు సత్యనారాయణ శర్మ, అలాగే కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న వేదపండితుడు సీహెచ్‌వీఎస్ సుబ్బారావులను సోమవారం ఈవో పెంచలకిషోర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈఈ వెంకటనారాయణ, ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, సిబ్బంది పాల్గొన్నారు.



అప్పు తీర్చమన్నందుకు కత్తితో దాడి



చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అప్పును తీర్చమన్నందుకు కత్తితో దాడి చేశాడు. అప్పిచ్చిన వ్యక్తికి గాయాలయ్యాయి. రెండో పట్టణ ఎస్ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. సంతపేటకు చెందిన లిలీఫ్.. పత్రాంపల్లెకు చెందిన నాగరత్నంకు కొంత డబ్బు అప్పుగా ఇచ్చాడు. ఆ డబ్బు తిరిగివ్వకుండా నాగరత్నం కాలయాపన చేస్తూ వచ్చాడు. ఈ నేపథ్యంలో డబ్బు తిరిగిచ్చేయమని పత్రాంపల్లె వద్ద నాగరత్నంను లిలీఫ్ సోమవారం గట్టిగా అడిగాడు. ఆగ్రహించిన నాగరత్నం కత్తితో లిలీఫ్‌ను పొడిచాడు. స్థానికులు బాధితుడిని తొలుత చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి, తర్వాత మెరుగైన చికిత్స నిమిత్తం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుడి తండ్రి రామచంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి స్థలంపై ఇరువర్గాల గొడవ

● ఓ వర్గంలోని నలుగురికి గాయాలు



గాయపడిన లోకేశ్ - నాగమ్మ

వెదురుకుప్పం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలంపై ఇరువర్గాల మధ్య గొడవలు జరిగాయి. ఓ వర్గంలోని నలుగురికి గాయాలయ్యాయి. బాధితుడు రాజవేలు(40) తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలయ్యపల్లె గ్రామ పంచాయతీ వేణుగోపాలపురం వడ్డిఇండ్లుకు చెందిన తమకు అదే గ్రామానికి చెందిన కన్నయ్య వర్గీయులకు మధ్య ఇంటి స్థలంపై వివాదం ఉందన్నారు. సోమవారం తనపైనా, తన మేనల్లుడు లోకేశ్(25)పై, అక్క బుజ్జమ్మ(45)పై, తల్లి నాగమ్మ (70)పై కన్నయ్య వర్గీయులు దాడి చేశారని ఆరోపించారు. తన తల్లి వృద్ధురాలు అని కూడా చూడకుండా కాలు, చెయ్యి విరిచారని వాపోయాడు. గాయపడిన తాము 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి వెళ్లామని చెప్పారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరాడు. ఈ విషయమై వెదురుకుప్పం పోలీసులు ఆరా తీస్తున్నారు. రాత్రి తొమ్మిది గంటల వరకు కేసు నమోదు కాలేదని సమాచారం.

పని ఉందని తీసుకెళ్లి నా భర్తను కొట్టారు

● పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్య

వెదురుకుప్పం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పని ఉందని ఇంటి నుంచి తీసుకెళ్లి తన భర్తను గాయపరిచారని అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కార్వేటినగరం మండలం కొటార్వేడు కాలనీకి చెందిన కోకిల, భారతిరాజా దంపతులు ఆదివారం రాత్రి ఏడు గంటల సమయంలో తమ ఇంట్లో ఉన్నారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన సి.జీవరత్నం, పి.రాజాలు వారింటికి బైక్‌పై వచ్చారు. కొల్లాగుంటలో పని ఉందని భారతిరాజాను తమ వెంట తీసుకెళ్లారు. కొల్లాగుంట వద్ద అప్పటికే అదే గ్రామానికి చెందిన పి.వెంకటేష్ వేచి ఉన్నారు. అక్కడున్న ఓ మద్యం దుకాణంలో మద్యం తీసుకుని సమీపంలోనే కొబ్బరితోటలో అందరూ కలసి తాగారు. ఆ మత్తులో గొడవపడ్డారు. భారతిరాజాను బీరు బాటిల్‌తో కొట్టి.. కాళ్లు, చేతులతో తన్ని గాయపరిచారు. గాయాలపాలైన భారతిరాజాను తొలుత కార్వేటినగరం సీహెచ్‌సీకి, తర్వాత 108 అంబులెన్స్‌లో నగరికి తీసుకెళ్లారు. ఈ విషయమై కోకిల సోమవారం ఫిర్యాదు చేయడంతో కార్వేటినగరం పోలీసులు కేసు నమోదు చేశారు.

రక్షణశాఖ ఆదేశిస్తే పాక్‌తో యుద్ధానికి సిద్ధం

● ఉగ్రదాడి మృతులకు కొవ్వొత్తులతో మాజీ సైనికుల నివాళి



పుంగనూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రక్షణశాఖ ఆదేశిస్తే పాకిస్తాన్‌తో యుద్ధంలో తల పడేందుకు సిద్ధంగా ఉన్నామని పుంగనూరు మాజీ సైనికులు స్పష్టం చేశారు. సోమవారం రాత్రి స్థానిక ఇందిరా సర్కిల్ నుంచి ప్రైవేటు బస్టాండ్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పహల్గాం మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని అంజలి ఘటించారు. మాజీ సైనికుడు, విశ్రాంత డీఎస్పీ కె.సుకుమార్ బాబు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు రెడ్డెప్ప, కృష్ణప్ప, ఎన్.సుబ్రమణ్యం, దేవరాజు, హనుమంతప్ప, నానబాల గణేశ్, శ్రీనివాసులు, చిన్నా, సతీశ్ , జవహర్, ప్రతాప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమపేరుతో మోసపోతున్న బాలికలు: సీడీపీవో



సమావేశంలో ప్రసంగిస్తున్న సీడీపీవో వినతశ్రీ

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బాలికలు ప్రేమపేరుతో మోసపోతున్నారని సీడీపీవో గుండ్లపల్లె వినతశ్రీ అన్నారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా గంగాధరనెల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీస్‌లో సోమవారం ఐదుశాఖల అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. బాలికల్లో చైతన్యం తేవడానికే అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, సచివాలయం మహిళా పోలీసులు, విద్యశాఖ సీఆర్‌పీలు, వెలుగు సీసీలు, గ్రామ సమాఖ్య లీడర్లును బృందంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బిందుమాలతి, సీహెచ్‌వో శ్రీనివాసులు, మహిళా పోలీస్‌ట్రైనర్ జయశ్రీ, హెల్త్ సూపర్‌వైజర్ ధర్మేంద్ర, వెలుగు సీసీలు కోమల, వినూత, విద్యాశాఖ సీఆర్‌పీలు ఎ.గుణశేఖర్, అల్లిముత్తు, టి.గుణశేఖర్, కుమారి, జయకోడి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రేపటినుంచి 'మహాభారత యజ్ఞం'

గుడిపాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వసంతాపురంలో బుధవారం నుంచి 'మహాభారత యజ్ఞం' నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలందరూ ఈ కార్యక్రమానికి విచ్చేయాలని కోరారు.

మొక్కలు నాటి.. సంరక్షిద్దాం

వెదురుకుప్పం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి.. సంరక్షిద్దామని కార్వేటినగరం ఎంపీడీవో చంద్రమౌళి పిలుపునిచ్చారు. సోమవారం కార్వేటినగరం మండల ఆర్వేవీటీ పేటలో యువతతో కలసి మొక్కలు నాటి నీరు పోశారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలన్నారు.

సీహెచ్‌సీలో తనిఖీలు



రోగుల వివరాలు తెలుసుకుంటున్న ఎంపీపీ లత

వెదురుకుప్పం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం సీహెచ్‌సీని సోమవారం ఎంపీపీ లత తనిఖీ చేశారు. ఎంపీడీవో చంద్రమౌళితో కలసి వెళ్లి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం కల్పించే వసతులను రోగులకు సక్రమంగా అందించాలని చెప్పారు.

అభినందనలు



వెదురుకుప్పం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు, కేరళ ఇన్‌చార్జి ఎం.నిషిధరాజును సోమవారం పుత్తూరులో వెదురుకుప్పం బీజేపీ నాయకులు కలిశారు. ఆమెకు పుట్టిన రోజు శుభాకాంక్షలు, అభినందలు తెలిపారు. ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్ర వార్షికోత్సవం

వెదురుకుప్పం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం అంగన్వాడీ కేంద్ర వార్షికోత్సవాన్ని స్త్రీశిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కార్వేటినగరం ఐసీడీఎస్ సీడీపీవో పద్మసునంద, సూపర్ వైజర్ భారతి, జయసుధ, చిన్నారులు పాల్గొన్నారు.

శివపార్వతుల ఊరేగింపు



త్రిశూలం ఊరేగింపులో ఉభయదారులు

సోమల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం శివ పార్వతుల ఉత్సవమూర్తులను పట్టణంలోని పురవీధుల్లో ఊరేగించారు. ఆలయంలో ఉదయం దిగువవీధి ఉభయ దారుల ఆధ్వర్యంలో అభిషేకపూజలు జరిపారు. అనంతరం స్వామి వారి త్రిశూలాన్ని నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. అర్చకుల ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. రాత్రి శివ పార్వతుల ఉత్సవమూర్తులను పల్లకీలో అలంకరించి చెక్క భజనలు, కోలాటాలు, బాణసంచా వేడుకల నడుమ ఊరేగించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త బీవీ సోమశేఖర్ పర్యవేక్షించారు.